RNI Reg-No. 69176/96

# నేటి మనదేశం

తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Medchal Malkajgiri
CIRCULATED THROUGHOUT TELANGANA STATE

సంపుటి :31 సంచిక : 204 హైదరాబాద్ సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: గురువారం 26-02-2026 పేజీలు : 12 వెల: 1-00

## సీఎం రేవంత్‌తో అడోబ్ సీఈవో శంతన్ భేటీ



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని అడోబ్ సీఈవో శంతను నారాయణ్ కలిశారు. హైదరాబాద్‌లో సీఎంతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ బోర్డు సభ్యుడిగానూ శంతను కొనసాగుతున్న నేపథ్యంలో గ్లోబల్ ట్రెండ్స్, కొత్త అవకాశాలతో రేవంత్‌తో చర్చించారు. ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, గ్రీన్ ఎనర్జీ, ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చ జరిగింది. ఏఐని సమర్థంగా వినియోగించుకునే విషయంపై శంతను నారాయణ్‌తో రేవంత్ చర్చించారు.



# సొంత భవనాల్లో రెవెన్యూ కార్యాలయాలు

### తహసిల్, ఆర్డీవో కార్యాలయాల నిర్మాణం అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి): ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శక పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సచివాలయంలోని తన కార్యాలయంలో బుధవారం రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పొంగులేటి అద్దె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల గురించి ఆరా తీశారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ఆధునీకీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం మిగతా 2లో..

# స్పీకర్ కోర్టులో మరో ఇద్దరి భవితవ్యం

### కడియం, దానంలపై తుది విచారణ... 27,28 తేదీల్లో విచారణకు సిద్ధం





హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి): తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల వ్యవహారం కీలక దశకు చేరుకొన్నది. ఇప్పటికే 8మంది విషయంలో స్పీకర్ స్పష్టమైన తీర్పును ఇచ్చారు. వీరు పార్టీ మారినట్లుగా ఆధారాలు లేవని స్పీకర్ తీర్పును ఇచ్చారు. ఇప్పుడు మరో ఇద్దరు ఎమ్మెల్యేల వ్యవహారాన్ని తేల్చబోతున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దాఖలైన అనర్హత పిటిషన్లపై విచారణ జరిపేందుకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణకు తమ వాదనలను వినిపించడంతోపాటు సాక్ష్యాధారాలను సమర్పించాల్సి ఉంటుందని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. స్పీకర్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ ఎదుట పిటిషనర్ల తరపు న్యాయవాదులు అడిగే ప్రశ్నలకు దానం, కడియం సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరలేదని నిరూపించుకోవడానికి అవసరమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుంది. గత నెల 18న ఈ కేసులో పిటిషనర్ పాడి కౌశిక్‌రెడ్డిని దానం నాగేందర్ తరపు న్యాయవాదులు ప్రశ్నించారు. 19న కడియం తరపు లాయర్లు వివేకానందగౌడ్‌ను ప్రశ్నించారు. స్పీకర్ జారీచేసిన విచారణ షెడ్యూల్ ప్రకారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 27వ తేదీన ఉదయం 11:00 గంటలకు విచారణ ఉంటుంది. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యాహ్నం 12:00 గంటలకు విచారణ చేపడుతారు. 28వ తేదీన ఉదయం 11:00 గంటలకు బీఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఉంటుంది. ప్రతివాది స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తరపున సాక్ష్యాధారాలను సేకరిస్తారు.

## విరోష్ జంటకు ప్రధాని శుభాకాంక్షలు

### విషెష్ చెబుతూ మోడీ లేఖ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆర్ఎన్ఎ): విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మరికొన్ని గంటల్లో వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. వీరి వివాహం ఉదయ్ పూర్ లో జరగనుంది. రష్మిక, విజయ్ వివాహం రాజస్థాన్ లోని ఉదయ్‌పూర్ లో ఉన్న ఐటీసీ హోటల్లో గ్రాండ్ గా జరగనుంది. వారి వివాహ వేదిక వద్ద మూడు అంచెల భద్రతను మోహరించినట్లు తెలుస్తోంది. స్థానిక పోలీసులు, హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం, అంతర్జాతీయ భద్రతా మధ్య ఈ వేడుక జరగనుంది. వీరి వివాహానికి కొద్దిమంది అతిథులు మాత్రమే హాజరుకానున్నారు. అంబానీకి కుటుంబం విజయ్ దేవరకొండ వివాహానికి హాజరు కానున్నారు. ఇప్పటికే అంబానీ ఫ్యామిలీ ఉదయ్ పూర్ కు చేరుకుంది. అదేవిధంగా విజయ్ దేవరకొండ , రష్మిక వివాహానికి శుభాకాంక్షలు తెలుపుతూ.. ప్రధాని మోడీ లేఖ రాశారు. ఫిబ్రవరి 26 న విజయ్ , రష్మిక వివాహం జరగనుంది. కాబోయే వధూవరులకు మోడి శుభాకాంక్షలు తెలిపారు. సప్తపదితో జీవితాంతం స్నేహంతో వర్ధిల్లాలని ఆశీస్సులు అందజేశారు. అలాగే విజయ్ రష్మిక జీవితం అద్భుతంగా ఉండాలని కోరుకుంటూ.. పరస్పరం గౌరవం, ప్రేమ, బాధ్యతలను పంచుకోవాలని మోడి సూచించారు. కాగా విజయ్, రష్మిక వివాహానికి కేవలం 100 మంది అతిథులను మాత్రమే ఆహ్వానించారు. అతిథులు, సన్నిహితుల కోసం మార్చి 4న హైదరాబాద్ లో రిసెప్షన్ నిర్వహించనున్నారు. అభిమానుల కోరిక మేరకు తమ పెళ్లి వేడుకకు 'విరోష్' అని పేరు పెట్టినట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

## తెలంగాణలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం

### క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపిన అధికారులు



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు ఉదయాన్నే చేరుకున్నారు. దీంతో ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను ఆయా కళాశాలల సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం 9 గంటలకు ఫస్టియర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి సెండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ పరీక్షల కోసం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 1495 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9.97 లక్షల మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఇంటర్ పరీక్షలకు హాల్ టికెట్ ఉంటేనే అనుమతిస్తున్నారు.

వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను పరీక్షకు అనుమతిస్తారు. హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా ఎంట్రీ ఉంటుంది. ఒక్క హాల్‌టికెట్ వెంట ఉంటే సరిపోతుంది. ఎలాంటి గుర్తింపు పత్రాలు అవసరంలేదు. తాజాగా సమాధాన పత్రాల మూల్యాంకనం షెడ్యూల్‌ను ఇంటర్‌బోర్డు ప్రకటించింది. మార్చి 4 నుంచి సంస్కృతం పేపర్ల మూల్యాంకనం ప్రారంభమవుతుంది. మార్చి 15నుంచి మొదటి విడత, మార్చి 18నుంచి రెండో విడత, మార్చి 20 నుంచి మూడో విడత మూల్యాంకనం ప్రారంభమవుతుంది. ఏప్రిల్ రెండో వారంలో ఫలితాలు విడుదల చేస్తారు.

## ఇజ్రాయిల్ పర్యటనకు బయలుదేరిన ప్రధాని

### రెండ్రోజుల పాటు పర్యటించనున్న మోడీ




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆర్ఎన్ఎ): భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం ఉదయం ఇజ్రాయెల్‌కు బయల్దేరి వెళ్లారు. ఎయిర్‌పోర్ట్‌లో మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆయన మిగతా 2లో..

## యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

### రామావతారంలో హనుమంత వాహన సేవలో నారసింహుడు



యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం ఉదయం శ్రీరామ అలంకారంలో హనుమంత వాహన సేవపై యాదగిరి శ్రీలక్ష్మి నరసింహస్వామి వారు ఆలయ తిరు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. నయన మనోహరంగా స్వామివారు అలంకార సేవపై ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. లోక కల్యాణం కోసం స్వామివారు వివిధ అవతారాలు ఎత్తారని ఈ సందర్భంగా అర్చకులు ఉపదేశించారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేద మంత్రలు, వేదపారాయణలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా స్వామి వారి ఊరేగింపు సేవ పై ఊరేగారు. రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. దీనికోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్తర మాడవీధుల్లో ప్రత్యేకమైన కల్యాణ వేదికను మిగతా 2లో..

## పర్సనల్ టూర్ కోసం 50 మంది సిబ్బంది

### బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ వివేక్ బంజల్ తీరుపై కేంద్రం సీరియస్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆర్ఎన్ఎ): భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ వివేక్ బంజల్‌పై కేంద్రం సీరియస్ అయింది. తన ప్రయాగ్‌రాజ్ పర్యటన ఏర్పాట్ల కోసం చేసిన డిమాండ్లు వైరల్ కావడంతో అతడికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ ప్రవర్తన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తీవ్రంగా స్పందించారు. అధికారి ఇచ్చిన వివరణ ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వివేక్ బంజల్ ప్రయాగ్‌రాజ్ పర్యటనకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు ఆ సమయంలో 21 పనులు చేసేందుకు 50 మంది మిగతా 2లో..

## యూకే ప్రయాణం.. భారతీయులకు ఈ-వీసా తప్పనిసరి




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆర్ఎన్ఎ): యూకేలో కొత్త డిజిటల్ వీసా వ్యవస్థ నేటి నుంచి అమల్లోకి వచ్చింది. సంప్రదాయ వీసాల స్థానంలో ఈ-వీసాలను అందుబాటులోకి తెచ్చారు. యూకేకు వెళ్లే భారతీయులు ఇకమీదట ఈ-వీసా కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఇమిగ్రేషన్ స్టేటస్‌కు సంబంధించిన షేర్ కోడ్ ఉంటుంది. దీన్ని ఉద్యోగ సంస్థలు, యజమానులు తదితరులతో పంచుకునే అవకాశం కల్పించారు. ఈ కొత్త పద్ధతిలో పేపర్ ఆధారిత వీసా స్టిక్కర్ల స్థానంలో డిజిటల్ వీసాలను అమలు చేయనున్నారు. డిజిటల్ వ్యవస్థ అయినప్పటికీ.. బయోమెట్రిక్ నమోదు కోసం వీసాదారులు దరఖాస్తు కేంద్రానికి వెళ్లాల్సిందే. అయితే, ప్రాసెసింగ్ సమయంలో పాస్‌పోర్టును అక్కడే వదిలి వెళ్లాల్సిన అవసరం మాత్రం ఉండదు. ఈ-వీసా లేదా ఇతర దస్త్రాలు లేకుంటే విమానయాన మిగతా 2లో..

## ఎన్సీఈఆర్టీ పాఠ్యాంశం వివాదం

### స్పందించిన కేంద్రం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆర్ఎన్ఎ): నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ 8వ తరగతి పాఠ్యాంశంలో న్యాయవ్యవస్థలో అవినీతి అంశాన్ని ప్రవేశపెట్టడం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయిలు

## సొంత భవనాల్లో రెవెన్యూ కార్యాలయాలు

కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. మొదటి దశలో.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండో విడతలో.. శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండేట్లు డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని వివరించారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందని పేర్కొన్నారు.

## ఇజ్రాయిల్ పర్యటనకు బయలుదేరిన ప్రధాని

సతీమణి సారా స్వాగతం పలుకనున్నారు. ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికేందుకు యావత్ ఇజ్రాయెల్ సన్నద్ధమైంది. ప్రధాని మోదీ రాకను ప్రకటిస్తూ, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు.. మోదీని తన స్నేహితుడిగా అభివర్ణించారు. ఈ రెండు రోజుల్లో ప్రధాని మోదీ అనేక ముఖ్యమైన రక్షణ, వ్యూహాత్మక అంశాలపై చర్చిస్తారు. తన పర్యటనలో మొదటి రోజు(బుధవారం) మోదీ.. నెతన్యాహుతో ప్రైవేట్ విందులో పాల్గొంటారు. అనంతరం ఇజ్రాయెల్ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఇరుదేశాల స్పెషల్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌నకు మోదీ పర్యటన ముందడుగుగా నిలుస్తుందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఎన్సీఈఆర్టీ పాఠ్యాంశం వివాదం

తీవ్ర వివాదమైంది. దానిపై సుప్రీంకోర్టు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. వివాదాస్పదమైన ఆ అంశాలను తొలగించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నాయి. అలాంటి అంశాలను చేర్చకుండా ఉండాల్సిందన్న అభిప్రాయం వ్యక్తమైంది. అవి ఆమోదయోగ్యమైనవి కావని, వాటి స్థానంలో స్ఫూర్తిదాయక అంశాలు చేర్చాల్సిందని వెల్లడించాయి. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు రాసుకొచ్చాయి. 8వ తరగతి విద్యార్థులకు న్యాయవ్యవస్థలో అవినీతి గురించి ఎన్సీఈఆర్టీ బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. "ఈ వ్యవహారం అందరినీ కలవరానికి గురిచేసింది. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను సహించబోం" అని సీజేఐ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

## పర్సనల్ టూర్ కోసం 50 మంది సిబ్బంది

బీఎస్ఎన్ఎల్ సిబ్బందిని కేటాయించాలని డిప్యూటీ మేనేజర్ లెవెల్ ఆఫీస్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ సిబ్బంది రైల్వేస్టేషన్‌లో ఆయన దిగగానే స్వాగతం పలకాలి. ఆలయ సందర్శనలు, బోట్ రైడ్స్‌ను సమన్వయం చేసుకోవాలి. టవల్స్, అండర్‌గార్మెంట్లు, నూనె, దువ్వెన వంటి వాటితో 'స్నాన్' కిట్స్ సిద్ధం చేయాలి. మతపరమైన కార్యకలాపాల కోసం రవాణా సౌకర్యాలు చూసుకోవాలి. ఫొటోలు తీయాలి. అలాగే ప్రయాణం కోసం ఏర్పాటుచేసిన వాహనాల్లో వాటర్ బాటిల్స్, చాక్లెట్లు, స్నాక్స్ ఉండేలా చూడాలి. ఈ విస్తృత సన్నాహాలకు సంబంధించిన ఆర్డర్ ఆన్‌లైన్‌లో వెలుగులోకి రావడంతో తీవ్ర వివాదమైంది. వనరుల దుర్వినియోగంపై నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారం కేంద్రం దృష్టికి చేరడంతో ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని బంజల్‌ను ఆదేశించింది. ఈ ప్రవర్తన నిబంధనల ఉల్లంఘన కిందికే వస్తుందని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.

## యూకే ప్రయాణం.. భారతీయులకు ఈ-వీసా తప్పనిసరి

సంస్థలు ప్రయాణికులను అడ్డుకునే అవకాశం ఉంటుంది. ఈ-వీసాను పోగొట్టుకోవడం, తస్కరించడం లేదా మార్పు చేసే అవకాశం ఉండదని, వీసాదారులు ఇమిగ్రేషన్‌ను వేగంగా, సురక్షితంగా నిర్ధరించుకునే వీలుకలుగుతుందని బ్రిటన్ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుత ఇమిగ్రేషన్ స్థితిలో మార్పులు చేయడం కూడా సాధ్యం కాదన్నారు. బ్రిటన్ సరిహద్దు, ఇమిగ్రేషన్ వ్యవస్థను పూర్తి స్థాయిలో నవీకరించడంలో భాగంగా ఈ-వీసా విధానాన్ని గతేడాది ప్రారంభించారు. నేటి నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చింది.

## యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

సిద్ధం చేశారు. వీవీఐపీ, వీఐపీ, ఇతర భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించే విధంగా ప్రత్యేకమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. కొండపైన పలు ప్రాంతాల్లో ఎల్ ఈ డీ స్క్రీన్లను ఉంచారు. ఈ సేవలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ భవానీ శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహ మూర్తి, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు, ఆలయ అధికారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక మూలాలు పెంచేలా చేయాలి

**పశుసంవర్థకశాఖను అభివృద్ధి పరచాలి... కొత్త ఆలోచనలతోనే పశుసంవర్థక శాఖలో మార్పులు**

**బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి... అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష**



**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయండని మంత్రి సూచించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలన్నారు. పశుసంవర్థక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పశుసంవర్థక, పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్ అవుతామో అధ్యయనం చేయాలన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని, అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి చేయాలన్నారు. ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. ఆర్థిక స్వావలంబన లభించే పథకాలను రూపొందించి అమలుచేద్దాం అని అన్నారు. తెలంగాణకు ఆర్థిక మూలాలు పెంచేలా పశు సంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు దిశానిర్దేశం చేశారు. . కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు తీసుకురాగలమని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని వివరించారు. బడ్జెట్‌లో నిధులు ఎన్ని కేటాయించారనేది కాకుండా ఎంతమేరకు ఖర్చు చేశామనే ఆలోచన చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. బ్జడెట్ లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయాలని అధికారులను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలని మంత్రి సూచించారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో పథకాలను డిజైన్ చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్ అవుతామో అధ్యయనం చేయాల్సిన అవసరముందన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని మంత్రి వాకిటి శ్రీహరి అభిప్రాయపడ్డారు. అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి రాష్ట్రంలో జరుగాలని మంత్రి శ్రీహరి అన్నారు. ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని మంత్రి వాకిటి స్పష్టం చేశారు.పాడి రంగానికి సంబంధించి అన్ని అంశాలు బ్జడెట్‌లో పొందుపరచాలని, పాల ఉత్పత్తి, అందుకావాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి శ్రీహరి అన్నారు. పాడి పరిశ్రమ బలోపేతం, సమన్వయం కోసం ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించుకోవాలని, దానివల్ల పాల ఉత్పత్తిని పెంచుకోవొచ్చని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. వెటర్నరీ సంస్థల్లో మౌలిక సదుపాయాలు, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలకు కూడా బ్జడెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం పశువులకు టీకాలు, ఔషధాల సరఫరా జరిగేలా, దానికి బ్జడెట్‌లో కేటాయింపులు ఉండాలని అధికారులకు మంత్రి వివరించారు. గతంలో లాగా కాకుండా పశుసంవర్ధక శాఖను బలోపేతం చేయాలని మంత్రి అధికారులకు వివరించారు. ఈసమీక్ష సమావేశంలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్ ఈంఅ, డైరెక్టర్ గోపీ, డెయిరీ డెవలంప్‌మెంట్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, పివి నర్సింహరావు వెటర్నరీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డా.జ్ఞానప్రకాశ్, ఉన్నతాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు సైబరాబాద్ పోలీసుల పటిష్ట బందోబస్తు

**ప్రత్యేక పోలీస్ బృందాలతో విద్యార్థులకు సహకారం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పరీక్షల నిర్వహణకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన సాయం అందిస్తున్నారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 11 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందిని నియమించి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు లేదా తప్పుడు అడ్రస్‌తో వేరే కేంద్రానికి చేరుకున్న వారిని వెంటనే గుర్తించి, పోలీస్ వాహనాల ద్వారా సంబంధిత పరీక్షా కేంద్రాలకు చేర్చారు.

ఇప్పటివరకు దాదాపు నలుగురు విద్యార్థులను సైబరాబాద్ పోలీసులు సరైన పరీక్షా కేంద్రాలకు చేర్చారు. పరీక్షల బందోబస్తును పరిశీలించేందుకు కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగిరెడ్డి కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన భద్రతతో పాటు సహాయక చర్యలు కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు.

## మోడీకి ఇజ్రాయిల్ గుజరాత్ లాంటిదే

**సిపిఐ ఎంపి సంతోష్ కుమార్ విమర్శలు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆర్ఎన్ఎ):** ప్రధాని నరేంద్ర మోడీకి ఇజ్రాయిల్ రెండో గుజరాత్ లాంటిదని సిపిఐ ఎంపి సంతోష్ కుమార్ విమర్శించారు. ప్రధాని మోదీ రెండురోజులపాటు ఇజ్రాయిల్ పర్యటన కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో గాజాలో మారణహోమం సృష్టించి వేలాది మంది పాలస్తీనియన్ల ప్రాణాలను బలితీస్తున్న ఇజ్రాయిల్‌ను మోడీ సందర్శించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెతుతున్నాయి. తాజాగా మోడీ ఇజ్రాయిల్ పర్యటనపై సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇజ్రాయిల్‌ను సందర్శించడం ప్రధాని మోడీకి ఒక హాబీగా మారింది. ఇజ్రాయిల్ ఆయనకు రెండవ గుజరాత్. ఇజ్రాయిల్ మానవాళి ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే దేశం. గాజాను లక్ష్యంగా చేసుకుని అమాయక ప్రజలను చంపుతోంది. మీకు తెలుసా..మోడీకి ఇజ్రాయిల్‌ని సందర్శించడం గుజరాత్‌ను సందర్శించడం లాంటిది' అని సందోష్ కుమార్ అన్నారు.

## ఢిల్లీలో గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం

**బిష్ణోయ్ లీగల్ టీమ్‌పై కాల్పులు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆర్ఎన్ఎ):** దేశ రాజధానిలో మరోసారి గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం రేపాయి. తీహార్ జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ లీగల్ టీమ్‌ను లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటన ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలో చోటుచేసుకుంది. లారెన్స్ బిష్ణోయ్ తరపున కోర్టు కేసులను వాదించే న్యాయవాదుల బృందం వాహనంలో ప్రయాణిస్తున్న సమయంలో ఈ దాడి జరిగింది. బైక్‌పై వచ్చిన దుండగులు ఒక్కసారిగా లీగల్ టీమ్ వాహనంపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీటీవీ (అఅ÷ఎ) ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది గ్యాంగ్ వార్‌లో భాగమా లేక లాయర్లను భయపెట్టడానికి చేసిన ప్రయత్నమా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. కాగా, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఇప్పటికే అనేక హై-ప్రొఫైల్ హత్యలు, బెదిరింపుల కేసుల్లో నిందితులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అతని లీగల్ టీమ్‌పై దాడి జరగడం సంచలనంగా మారింది.

## చెవినొప్పితో ఆస్పత్రికి వెళితే..ఘోరం

**డాక్టర్ల నిర్లక్ష్యంతో యువకుడు మృతి**

**నిజామాబాద్, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో ఘోరం జరిగిపోయింది. చెవి నొప్పితో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరిన యువకుడు మృతి చెందటం తీవ్ర విషాదాన్ని నింపింది. చేతికొచ్చిన కొడుకు అర్ధంతరంగా చనిపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో హాస్పిటల్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే.. భీంగల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన గంగం అజయ్ మంగళవారం చెవి నొప్పితో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. అజయ్ కండిషన్ చూసిన వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆపరేషన్ కోసం మత్తు మందు ఇచ్చిన తర్వాత అజయ్ చనిపోయాడు. దీంతో ఆస్పత్రి వైద్యులు, మత్తు వైద్యుల నిర్లక్ష్యం మూలంగా అజయ్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రిలో వెంటిలేటర్, ఎలాంటి సౌకర్యాలు లేవు అంటూ కుటుంబ సభ్యులు ఆరోపించారు. చేతికొచ్చిన కొడుకు చనిపోయాడని.. న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు హాస్పిటల్ ముందు ఆందోళనకు దిగారు. హాస్పిటల్ ఎదుటనే అజయ్ మృతదేహాన్ని దహనం చేస్తామని డీజిల్ డబ్బాతో ఆందోళనకు దిగారు కుటుంబ సభ్యులు. దీంతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.వైద్యుల నిర్లక్ష్యంతో అజయ్ మృతి చెందారని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆపరేషన్ సమయంలో ఎక్కువ మోతాదులో మత్తు మందు ఇవ్వటం వల్లనే అజయ్ మృతి చెందారని ఆందోళనకు దిగారు. ఆ క్రమంలో పోలీసులకు, కుటుంబ సభ్యులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

## జగద్గిరిగుట్టలో 14 తులాల బంగారం అపహరణ

**పక్కా ఆధారాలతో నిందితుడి అరెస్టు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బయటకు వెళ్తూ ఇంటి తాళం చెవిని దాచిన చోటే దొంగకు దొరకడంతో.. పని సులువైందనుకున్నాడో దొంగ. అదను చూసి ఇంట్లోకి ప్రవేశించి 14 తులాల బంగారు ఆభరణాలను దోచి ఉడాయించాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మబండలో వెలుగుచూసింది. జగద్గిరిగుట్ట డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండ దత్తాత్రేయ కాలనీకి చెందిన రేకపల్లి లక్ష్మి (63) ఈ నెల 23న సాయంత్రం 4.30 గంటల సమయంలో ఇంటికి తాళం వేశారు. ఆ తాళం చెవిని తలుపు పక్కనే ఉన్న డ్రమ్ కింద దాచి బయటకు వెళ్లారు. అయితే ఆమె తాళం దాస్తున్న విషయాన్ని అదే కాలనీకి చెందిన పత్రో శంకర్ (36) గమనించాడు. ఆమె వెళ్లగానే నిందితుడు డ్రమ్ కింద ఉన్న తాళంతో తలుపులు తీసి లోపలికి ప్రవేశించాడు. టీవీ టేబుల్‌పైనే ఉన్న అల్మారా తాళం చెవులతో లాకర్‌ను తెరిచి అందులోని సుమారు 14 తులాల బంగారు నగలను దొంగిలించి పరారయ్యాడు. అదే రోజు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్న లక్ష్మి దంపతులు, అల్మారా తెరిచి ఉండటం చూసి ఆందోళన చెందారు.

## యూట్యూబర్ కోమలి ఆత్మహత్య

**ప్రేమ వ్యవహారమే కారణమని అనుమానాలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్ చిత్రపురి కాలనీలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ యూట్యూబర్ కోమలి ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆమె ఇలా బలవన్మరణానికి పాల్పడినట్టు తెలుస్తోంది. నగరంలోని ఓ ప్రముఖ కాలేజ్‌లో బీఎస్సీ చదువుతున్న కోమలి.. చిత్రపురి కాలనీలో తన బంధువుల ఇంట్లో ఉంటోంది. విశాఖపట్నానికి చెందిన కోమలి.. తక్కువ కాలంలో యూట్యూబర్‌గా మంచి పేరు సంపాదించుకుంది. కోమలి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఓ వ్యక్తిని ప్రేమించింది. ఏడాది క్రితం ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో బ్రేకప్ అయ్యింది. ఈ నేపథ్యంలో కొన్ని నెలల క్రితం కోమలి ఆత్మహత్యకు యత్నించగా.. బంధువులు కాపాడారు. ఈ మధ్య మరోసారి ఆ యువకుడితో గొడవ జరిగినట్లు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుంది. ఆమె తల్లి మంగళవారం రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## జీనుగురాలలో పల్లె ప్రకృతి వనంలో 200 చెట్ల నరికివేత

**ప్రకృతి వనాలపై పగబట్టడం దుర్మార్గమైన చర్య అన్న కెటిఆర్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కాంగ్రెస్ కబంద హస్తాల్లో చిక్కుకుని రెండేళ్లుగా విలవిలలాడుతున్న తెలంగాణలో మనషులనే కాదు.. చివరికి పచ్చని చెట్లను కూడా బతకనివ్వడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రతి పల్లెలో పచ్చదనం ఉండాలనే మహోన్నత లక్ష్యంతో కేసీఆర్ నిర్మించిన ప్లలె ప్రకృతి వనాలపై కూడా పగబట్టడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. మహబూబ్ నగర్‌లోని దేవరకద్ర మండలం జీనుగురాలలో పల్లె ప్రకృతి వనంలోని 200 చెట్లను కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులే నిర్దాక్షిణ్యంగా నరికివేయడం దారుణమని కేటీఆర్ విమర్శించారు. పదేళ్లపాటు ఆహ్లాద వాతావరణంలో కళకళలాడిన ప్లలెలను అన్నిరకాలుగా ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ నిజస్వరూపం రోజుకో రూపంలో బయటపడుతోందని తెలిపారు. ఇప్పటికే చెక్ డ్యామ్‌లను పేల్చివేస్తున్నారని.. చెరువులను చెరబట్టారని.. వ్యవసాయాన్ని కుప్పకూల్చారని.. కులవృత్తులను కాలరాశారని పేర్కొన్నారు. ఇప్పుడు నీడనిచ్చే చెట్లను కూడా అడ్డంగా నరికేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ఈ దుశ్చర్యకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 'పల్లె కన్నీరు పెడుతుందో' అని మరోసారి పాడుకునే దుస్థితి తెచ్చిన కాంగ్రెస్ పార్టీపై తెలంగాణలోని ప్రతి గ్రామం తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

## యూట్యూబర్ అన్వేష్ పై లుకౌట్ నోటీసులు

**విదేశాల్లో ఉండడంతో పంజాగుట్ట పోలీసుల వెల్లడి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** యూట్యూబర్ అన్వేష్ పై పంజాగుట్ట పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల ఆయన విడుదల చేసిన ఒక వీడియోలో అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించినట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. సోషల్ మీడియా వేదికగా చేసిన ఆ వ్యాఖ్యలు సమాజంలో వివాదాస్పదంగా మారడంతో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ వ్యవహారంపై స్పందించిన పంజాగుట్ట పోలీస్ అధికారులు, అన్వేష్ చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా అభ్యంతరకరంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఆయన విదేశాల్లో ఉండడంతో దేశంలోకి ప్రవేశించిన వెంటనే అదుపులోకి తీసుకునేలా లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల అన్వేష్ తన సోషల్ మీడియా ద్వారా వీడియో విడుదల చేసి.. తనకు రెండు ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు, రెండు యూట్యూబ్ ఛానల్స్ ఉన్నాయని వెల్లడించారు. ఇందులో ఆయన ప్రధాన అకౌంట్‌ను ఇన్‌స్టాగ్రామ్ బ్లాక్ చేసినట్లు తెలిసింది. దీనిపై కూడా పోలీసులు దృష్టి సారించారు. ఈ కేసు దర్యాప్తు భాగంగా, అన్వేష్‌కు సంబంధించిన అకౌంట్ల వివరాలు, వీడియోల సమాచారం అందించాలని యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ సంస్థలకు పోలీసులు అధికారికంగా లేఖ రాయనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో చట్టవిరుద్ధ కంటెంట్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన పరిణామాలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## రాష్ట్రంలో అదుపుతప్పిన శాంతిభద్రతలు

**కామారెడ్డి, నిజామాబాద్ ఘటనలపై డిజిపికి బిజెపి ఫిర్యాదు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, హిందువులు లక్ష్యంగా దాడులు పెరిగాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు అన్నారు. కామారెడ్డి ఘటనలో కాంగ్రెస్ గూండాగిరి బయటపడిందన్నారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డిని రామచంద్రరావు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కామారెడ్డి, నిమాజాబాద్ జిల్లాల్లో జరిగిన ఘటనలపై డీజీపీకి ఫిర్యాదు చేశారు. అనంతరం రామచంద్రరావు మీడియాతో మాట్లాడుతూ.. కొన్నిరోజుల క్రితం బాన్సువాడలో ఎంఐఎం నేతలు ఆందోళనలు సృష్టించారని తెలిపారు. ఈ ఘటనపై నిరసన తెలిపిన హిందూ యువకులను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. దాదాపు 27 మంది హిందూ యువకులను జైలుకు పంపారని తెలిపారు. హిందూ కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి క్యాంప్ ఆఫీసుపై కాంగ్రెస్ నేతలు దాడి చేసేందుకు యత్నించారని ఆయన అన్నారు. నిజామాబాద్‌లో అడ్వకేట్ కళ్యాణిపై ఎంఐఎం నేతలు దాడి చేశారని ఆరోపించారు. 'నామ్ కే వాస్తే' దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని రామచంద్రరావు తెలిపారు. చాంద్రాయణ గుట్ట, ముత్యాలమ్మ గుడి, సికింద్రాబాద్‌లో హిందూ ఆలయాలపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. వీటిని ప్రోత్సహిస్తున్నది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం వద్దే హోం శాఖ ఉందని.. తెలంగాణలో మరీ ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో శాంతి భద్రతలు దెబ్బతిన్నాయని ఆయన విమర్శలు గుప్పించారు. పోలీసులు అరెస్ట్ చేసిన హిందూ యువకులను వెంటనే విడుదల చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని రామచంద్రరావు డిమాండ్ చేశారు.

## కుమ్మెర ఘటన మానవత్వానికే మచ్చ.... దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**పసిపాప కుటుంబానికి కెటిఆర్ పరామర్శ**

**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాగర్ కర్నూల్ జిల్లాలో ఇటీవల కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన గొడవలో రెండు నెలల చిన్నారి మృతిచెందిన ఘటనలో దోషులు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం కెటిఆర్ పరామర్శించారు. తమకు న్యాయం చేయాలని చిన్నారి కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తున్నారు. బాధిత కుటుంబం ఆందోళన చేస్తున్న శిబిరం వద్దకి వెళ్లి వారితో మాట్లాడి ధైర్యం చెప్పారాయన. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఘోరాతి ఘోరమైన మానవత్వానికి మచ్చ తెచ్చే విధంగా చిన్నారిని హత్యచేశారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల పసిగుడ్డు ప్రాణాలు తీసిన హంతకులను ప్రభుత్వం వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. మల్లన్న జాతరలో చిన్నారి తల్లి దర్శనం అడిగినందుకు ఆ పాపను పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు. దేవుడు దర్శనం అడిగిన పాపానికి.. దాడి చేసి మానవత్వానికే మచ్చ తెచ్చారని ఆగ్రహించారు. ఈ దారుణానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్ష పడాల్సిందేనని హెచ్చరించారు. పసిగుడ్డు ముఖం చూసి తండ్రిని వదలిపెట్టమని ప్రాధేయపడ్డ.. వదలకుండా కాలితో ఆ పాపను తన్నితే చనిపోయింది. యూనిఫామ్‌కి విలువ లేకుండా హంతకులను కాపాడే ప్రయత్నం పోలీసులు చేస్తున్నారు. రెండు నెలల పసిగుడ్డుకు కులం తెలుసా..?, మనుషులను చిన్నచూపు చూసి దర్శనానికి రానివ్వకుండా చేయడం ఘోరం. హంతకులు ఎవరైనా.. ఏ పార్టీవారైనా కచ్చితంగా శిక్షించాల్సిందే. ఈ ఘటనకు కారణమైనా ఎనిమిది మందిని అరెస్టు చేయాల్సిందే. శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై స్పందించాలి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాల్సిందే. పొత్తిళ్లలోని పసిగుడ్డును హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాల్సిందే. న్యాయం జరిగేదాకా పోరాటం ఆపకండి. దుర్మార్గులను శిక్షించేదాకా వదిలిపెట్టొద్దు. ఈ ఘటనకు కారణమైనా ఎనిమిదిమందిపై హత్యానేరం మోపకపోతే శాసనసభలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీస్తాం. బాధిత కుటుంబాన్ని కంటికి రెప్పల కాపాడుకుంటాం. కులం, మతం లేదు.. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా మేం అండగా ఉంటాం' అని కేటీఆర్ భరోసా కల్పించారు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# నాలగేళ్లయినా ముగియని ఉక్రెయిన్ సంక్షోభం!

ప్రపంచంలో ఏ యుద్ధాలను తీసుకున్నా నష్టపోతున్నది ప్రజలే. ఆయా దేశాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. ప్రపంచ దేశాలను నష్టాల కుంపట్లో పడేస్తున్నాయి. రష్యా,ఉక్రెయిన్ యుద్ధం మొదలై నాలుగేళ్లు దాటింది. ఎందుకు యుద్ధం మొదలు పెట్టారో తెలియడం లేదు. అలాగని ముగింపు కూడా పలకడం లేదు. ఈ రావణ కాష్టం ఇప్పట్లో చల్లారేలా లేదు. అగ్రరాజ్యం తలచుకుంటే అంతే సంగతులని రష్యా నిరూపిస్తే... అమెరికా దానిని నిజం చేసింది. రష్యా బాటలోనే అమెరికా కూడా అడపాదడపా దాడులతో ప్రపంచాన్ని గుప్పిట పెట్టుకోవాలని చూస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక భౌతిక దాడులతో పాటు, ఆర్థిక దాడులతో ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్నారు. ఇకపోతే ఒకప్పటి సోవియట్ యూనియన్‌లోని ఉక్రెయిన్ అధినేత జెలెన్స్కీ చేష్టల కారణంగా రష్యాతో కయ్యానికి దిగారు. పుతిన్, ఎలెన్స్కీ ఇద్దరూ బాగానే ఉన్నారు. కానీ ఇరు దేశాల ప్రజలు తీరని సంక్షోభంలో కూరుకు పోయాయరు. వేలాదిమంది మృత్యువాత పడ్డారు. ఫిబ్రవరి 24వ తేదీతో ఉక్రెయిన్ యుద్ధం ఐదెయేట ప్రవేశించింది. దీనికి బాధ్యులైన నాటో కూటమి దేశాలు ఎలా, ఎప్పుడు ముగింపు పలుకుతాయో తెలియటం లేదు. నిజానికి ట్రంప్ కూడా ముగింపు చేసే సాహసం జరగడం లేదు. యుద్ధాలకు నేను ముగింపు పలుకుతున్నానని బీరాలు పలికిన ట్రంప్ ఈ యుద్ధాన్ని కూడా ఆపుతానని చెప్పినా, ఆ పని చేయలేక పోయారు. ఉక్రెయిన్ తాజా సంక్షోభానికి నాలుగేళ్లు నిండినప్పటికీ నిజానికి 2014 నుంచి ఈ అంతర్యుద్ధం కొనసాగుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐరోపా ఖండంలో దీర్ఘకాలం సాగిన పోరుగా ఇప్పటికే చరిత్రలో ఉక్రెయిన్ సంక్షోభం నమోదైంది. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రపంచం మీద ప్రభావం చూపుతున్నది. ఏ దేశం కూడా ఎదుర్కోని తీవ్రమైన ఆంక్షలను రష్యా మీద నాటో కూటమి దేశాలు అమలు చేస్తున్నాయి. రష్యాతో వాణిజ్య లావాదేవీలు నిర్వహించే భారత్ తదితర దేశాల మీద కూడా అపరాధ పన్నుల విధింపు, ఇతర చర్యలు తీసుకుంటామని అమెరికా బెదిరిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనకుండా చేసిన ట్రంప్ ఎలా పెత్తనం సాగిస్తున్నాడో గమనించవచ్చు. ఇప్పటి వరకు ఉక్రెయిన్ పోరులో రెండు దేశాలకు జరిగిన నష్టాల గురించి పరస్పరం అతిశయోక్తులు తప్ప నిజానిజాలు వెల్లడి కావటం లేదు. రెండు వైపులా 20 లక్షల మంది సైనికులు గాయపడటం లేదా మరణించి ఉంటారన్నది ఒక అంచనా. పన్నెండున్నర లక్షల మంది రష్యన్లు మరణించి నట్లు ఉక్రెయిన్ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సిఎస్ఐఎస్ అనే సంస్థ 3.25 లక్షల మంది మరణించటంతో సహా పన్నెండు లక్షల మంది రష్యా వైపు బాధితులు ఉన్నట్లు చెబుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఏ పోరులోనూ ఇంత నష్టం జరగలేదు. తమకు వ్యతిరేకంగా నాటో విస్తరణ పేరుతో ఉక్రెయిన్‌కు సభ్యత్వ మిచ్చి తమ ముంగిటకు అణ్వాయుధాలను మోహరించాలన్న అమెరికా ఎత్తుగడలను వమ్ము చేస్తూ గతంలో తన ప్రాంతంగా ఉన్న క్రిమియా ద్వీపాన్ని రష్యా ఆ ఏడాది విలీనం చేసుకుంది. ఉక్రెయిన్ పాలకులు అప్పటి నుంచి రష్యన్లు మెజారిటీగా ఉన్న తమ డాన్‌బాస్ ప్రాంతంపై దాడులకు మిలిటరీని దించారు. దానికి వ్యతిరేకంగా ఆ ప్రాంతంలో తలెత్తిన తిరుగుబాటుకు రష్యా మద్దతు ఇచ్చింది. సైనిక చర్య ప్రారంభించి నప్పటి నుంచి నాలుగేళ్ల కాలంలో 26 శాతం ఉక్రెయిన్ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మెల్లమెల్లగా కొత్త ప్రాంతాలకు చొచ్చుకుపోతున్నది. ఈ నాలుగేళ్ల యుద్ధ పర్యవసానాలను పరిశీలిస్తే ఇది అంత తేలికగా ముగిసేలా లేదు. పుతిన్ కూడా వదిలేలా లేరు. ఇప్పుడున్న యథాతథ స్థితిలో పోరు ముగించటానికి తాము సిద్ధమేనని, అయితే డాన్‌బాస్ తూర్పు ప్రాంతంలో తమ మిలిటరీ అక్కడే ఉండాలని జెలెన్స్కీ పట్టుబడుతున్నాడు. ఉక్రెయిన్ తిరుగుబాటు ప్రాంతాలకు స్వాతంత్ర్యం ఇవ్వాలని, దాని మిలిటరీ బలం, ఆయుధాలను పరిమితం చేయాలని, మరేదేశ మిలిటరీ ఏ రూపంలోనూ ఉక్రెయిన్ గడ్డ మీద ఉండకూడదని పుతిన్ పునరుద్ఘాటిస్తున్నాడు. అయితే అమెరికా ప్రభావంలో ఉన్న జెలెన్స్కీ మాత్రం పాత సోవియట్ బంధాన్ని మరచి వ్యవహరించడమే యుద్ధానికి హేతువుగా గుర్తించాలి. ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉన్న ప్రాంతం పారిశ్రామికంగా, మిలిటరీ రవాణాకు కీలకమైన రైల్వేలు, రోడ్లు ఈ ప్రాంతంలోనే ఉన్నందున వాటిని వదులుకొనేందుకు పుతిన్ సిద్ధంగా లేదు. ఇకపోతే దాడుల కారణంగా ఉక్రెయిన్ జనాభా 4.2 కోట్ల మందిలో నాలుగో వంతు మంది ఇతర దేశాలకు తరలిపోయినట్లు చెబుతున్నారు. రష్యా ఆధీనంలోని ప్రాంతాలలో 50 లక్షల మంది నివశిస్తున్నారు. క్రిమియాతో సహా 26 శాతం భూ భాగాన్ని ఉక్రెయిన్ కోల్పోయింది. అయితే జెలెన్స్కీ దళాలు తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను తీసి వేస్తే ఆ మొత్తం 20 శాతానికి తగ్గినట్లు మరొక అంచనా. గత మూడు సంవత్సరాల్లో పెద్దగా రష్యన్లు ముందుకు పోలేదని మరి కొందరు చెబుతున్నారు. రష్యా సైనిక చర్య ప్రారంభం నుంచి నాలుగేళ్లలో ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోయింది. రష్యా ప్రధాన కేంద్రీకరణ మౌలిక సదుపాయాలను నాశనం చేయటం, ఆర్థిక మూలాలను దెబ్బ తీయటంపైనే కొనసాగుతున్నది. విద్యుత్ సరఫరా తీవ్రంగా దెబ్బతిన్న కారణంగా ఫ్యాక్టరీలను నడిపేందుకు డీజిల్ జనరేటర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి. మిలిటరీ చర్య ప్రారంభించిన తొలి రోజుల్లో పుతిన్ యంత్రాంగం వేసిన అంచనాలు దెబ్బతిన్నాయి. నాటో కూటమి దేశాలు ఉక్రెయిన్‌కు అవసరమైన ఆయుధాలు, ఆర్థిక సాయంతో పాటు రష్యన్ మిలిటరీ కదలికల గురించి కీలకమైన సమాచారాన్ని అందించటంతో తీవ్రమైన ఎదురుదెబ్బలు తగిలాయి. దాంతో వ్యూహం మార్చు కోవాల్సి వచ్చింది. కొన్ని వారాల్లో కీవ్ పతనం అవుతుందన మాస్కో అంచనాలు తప్పాయి. రష్యా కోరిన విధంగా కొంత ప్రాంతాన్ని కోల్పోయి ఒప్పందం చేసుకుంటే సరే లేకపోతే ఉక్రెయిన్ గెలిచే అవకాశాలు లేవని డోనాల్డ్ ట్రంప్ గతేడాది నవంబరులో బహిరంగంగానే చెప్పాడు. గతేడాది ఇరాన్ మీద దాడులు, మరోసారి హెచ్చరికలు, వెనిజులా అధ్యక్షుడిని అపహరించిన డోనాల్డ్ ట్రంప్ రష్యా మీద చర్యకు ఎందుకు వెనకాడుతున్నట్లు అని కొందరు విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. రష్యా మీద ఎన్ని ఆంక్షలు విధించినప్పటికీ అవి పనిచేయటం లేదని ట్రంప్‌కు అర్థమైంది. మొత్తానికి ఈ రావణ కాష్టం చల్లారేలా లేదు. ఇరు దేశాలు కూర్చుంటేనే సయోధ్య కుదరగలదు. అమెరికాలాంటి దేశాలు, నాటో జోక్యం వల్లనే ఇది మరింత ముదిరిందన్న సుస్పష్టం.

## ఆస్పత్రి నుంచి శరద్ పవార్ డిశ్చార్జ్

**ముంబయి,ఫిబ్రవరి 25(ఆర్ఎన్ఎ):** ఇటీవల అనారోగ్య కారణాల రీత్యా చికిత్స కోసం ఎన్‌సిపి నేత శరద్‌పవార్ పూనెలోని రూబీ హాల్ ఆసుపత్రిలో చేరారు. డీహైడ్రేషన్‌కు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు ఆదివారం ఈ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగుపడడంతో బుధవారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం శరద్‌పవార్ బాగానే ఉన్నారు. అందుకే ఆయనను డిశ్చార్జ్ చేశాం. రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించాం అని రూబీ హాల్ ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్, ఛైర్మన్ మేనేజింగ్ ట్రస్టీ అయిన డాక్టర్ పర్వేజ్ గ్రాంట్ అన్నారు. కాగా, శరద్‌పవార్ ఈ నెల్లోనే ఫిబ్రవరి 9న ఛాతి ఇన్ఫెక్షన్ వల్ల ఇదే ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు.

# గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి



- దేశాన్ని మరింత ధృడంగా నిర్మించడమే లక్ష్యం
- సాదాసీదా స్థాయి నుంచి సుదృఢ అమెరికాను నిర్మించా
- పౌరుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం
- ఇరాన్ అణు కార్యాక్రమాలతో అప్రమత్తంగా ఉన్నాం
- తన పాలనా ప్రయాణం యుగాలకు మలుపు
- స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ సుదీర్ఘ ప్రసంగం

**వాషింగ్టన్,ఫిబ్రవరి 25(ఆర్ఎన్ఎ):** అమెరికా గతంలో కన్నా దృఢంగా, మెరుగ్గా, సుసంపన్నంగా మారిందని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇది అమెరికాకు స్వర్ణయుగం అని ఆయన వెల్లడించారు. మంగళవారం స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇది చారిత్రాత్మక కాలంగా అభివర్ణించారు. తన పరిపాలన ప్రయాణం.. యుగాలకు మలుపుగా ఉంటుందని తెలిపారు. దేశ ఆర్థికాభి వృద్ధి పరుగులు పెడుతుందన్నారు. భవిష్యత్తులో దేశాన్ని మరింత మెరుగు పరుస్తామని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే జాతీయ పునరుజ్జీవం, ఆర్థిక వృద్ధితోపాటు ప్రపంచ ప్రభావంపై దృష్టి సారించినట్లు డొనాల్డ్ ట్రంప్ వివరించారు. ప్రపంచ స్థాయిలో అమెరికా మెరుగుపడిందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల వరకు అమెరికా సాదాసీదాగా ఉండేదని.. కానీ ప్రస్తుతం ప్రపంచంలోనే అగ్ర భాగాన నిలిచిందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం.. ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను పురుషుల హాకీ ఒలింపిక్స్ విజేత కానర్ హెల్లెబ్యాక్‌కు ప్రదానం చేయనున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత తొమ్మిది మాసాల్లో అమెరికాలోకి ప్రవేశించిన అక్రమ వలసదారులు శాతం సున్నాకు చేరిందని పేర్కొన్నారు. 2028లో ఒలింపిక్స్‌కు అమెరికా వేదిక కానుందని ప్రకటించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వాన్ని నిర్మిస్తున్నామని ప్రజలకు భరోసా ఇచ్చారు. పౌరుల సంక్షేమానికే తమ తొలి ప్రాధాన్యమన్నారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్‌తో అమెరికన్లకు ఉపశమనం కలిగిందన్నారు. అలాగే సరిహద్దు భద్రత, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పూర్తిగా నిరోధించామని ట్రంప్ చెప్పారు. దేశంలోని ఆర్థిక అంశాల ను సైతం ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. గ్యాస్ ధరలు తగ్గించామని.. ఆ తర్వాత అంటే.. మూడు నెలల్లో యూఎస్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుందన్నారు. తమ కొత్త స్నేహితుడు, భాగస్వామి అయిన వెనిజులా నుంచి 80మిలియన్ బ్యారెళ్ల చమురును తీసుకున్నామని ఆయన వివరించారు. ఇదంతా ఆ దేశ నాయకుడు నికోలస్ మదురోను పదవీచ్యుతుడిని చేసిన నాటినుంచి నేటివరకు ఇది చోటు చేసుకుందన్నారు. దాంతో ఆమెరికా చమురు ఉత్పత్తి రోజుకు 60 వేల బ్యారెళ్ల మేర పెరిగిందని సోదాహరణగా విపులీకరించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో చేసిన ప్రతిజ్ఞ.. డ్రిల్, బేబీ, డ్రిల్‌ను ట్రంప్ ఉటంకించారు. వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్‌లో ఉభయసభలను ఉద్దేశించి ఆయన అతి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సుమారు గంటా 50 నిమిషాల పాటు ట్రంప్ మాట్లాడారు. తన ప్రసంగాల్లో ఇదే అతిసుదీర్ఘమైందిగా రికార్డుకెక్కింది. 2000 సంవత్సరంలో అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ అత్యధికంగా 90 నిమిషాల పాటు మాట్లాడారు. ఇప్పుడు ఆ రికార్డును ట్రంప్ బ్రేక్ చేశారు. గత ఏడాది మార్చిలో కూడా ట్రంప్ సుమారు 100 నిమిషాల పాటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన విషయం తెలిసిందే. ట్రంప్ తన ప్రసంగంలో ఎక్కువగా ఆర్థిక ఎజెండా గురించి ప్రస్తావించారు. ఇక ఇరాన్ అంశంలో వార్నింగ్ ఇచ్చారు. వాస్తవానికి ఆ సమస్యను దౌత్యం ద్వారా పరిష్కరించేందుకు ఇష్టపడుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. కానీ అణ్వాయుధాలను సమీకరిస్తున్న ఇరాన్ వైఖరిని మాత్రం ట్రంప్ ఖండించారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ విరమించుకోవాలన్నారు. అమెరికాను తాకే క్షిపణులను ఇరాన్ డెవలప్ చేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. కానీ దీనిపై ఆయన తన ప్రసంగంలో ఎటువంటి ఆధారాలను బయటపెట్టలేదు. యురోప్‌కు ప్రమాదంగా మారే కొన్ని మిస్సైల్స్‌ను ఇప్పటికే ఇరాన్ డెవలప్ చేసిందన్నారు. ఇతర దేశాల్లో ఉన్న అమెరికా బేస్‌లను కూడా టా÷-గ్గ÷ట్ చేసే రేంజ్ ఇరాన్‌కు ఉందన్నారు. ఇక అమెరికా భూభాగానికి చేరుకునే స్థాయికి తగ్గ క్షిపణులను కూడా ఇరాన్ అభివృద్ధి చేస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. మిడిల్ ఈస్ట్‌పై ట్రంప్ ఎక్కువగా ఫోకస్ చేయడం వల్ల.. ఇరాన్‌తో యుద్ధానికి ఆ దేశం సిద్ధం అవుతుందేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే తాము ఇచ్చిన డిమాండ్లను ఒకవేళ ఇరాన్ అంగీకరించకపోతే, అప్పుడు ట్రంప్ అనుకున్నంత పనిచేసే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై దాడి చేశామని, ఆ దాడి వల్ల ఆ దేశ న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్ స్తంభించినట్లు ట్రంప్ చెప్పారు. న్యూక్లియర్ వెపన్ అంశంలో ఇరాన్ ఇంకా ఎటువంటి హామీ ఇవ్వలేదన్నారు. అణ్వాయుధాలను తయారు చేయమన్న వ్యాఖ్యలు ఇంకా ఇరాన్ నుంచి రావడం లేదన్నారు.

# ఇంటర్ పరీక్షకు 17 నిముషాలు ఆలస్యం

### పరీక్షా కేంద్రానికి అనుమతించని అధికారులు... కన్నీరు పెట్టుకున్న విద్యార్థిని శరణ్య



**రాజన్నసిరిసిల్ల,ఫిబ్రవరి 25(ఆర్ఎన్ఎ):** ఎగ్జామ్ సెంటర్‌కు ఆలస్యంగా రావడంతో ఇంటర్ విద్యార్థినిని పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. తన తండ్రి డ్రాప్ చేస్తాడేమోనని ఎదురుచూసి చూసి, చివరకు ఆర్టీసీ బస్సులో రావడంతో ఎగ్జామినేషన్ సెంటర్‌కు 17 నిమిషాలు ఆలస్యంగా చేరుకుంది. ఈ క్రమంలో అధికారులు పరీక్షకు అనుమతించకపోవడంతో.. సెంటర్ గేటు వద్దనే విద్యార్థిని కన్నీళ్లు పెట్టుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా గొల్లపల్లికి చెందిన పిట్ల శరణ్య గొల్లపల్లి-బొప్పాపూర్ రాచర్ల జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. బుధవారం ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్ ప్రారంభం కావడంతో తన తండ్రి ఎగ్జామ్ సెంటర్ ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ దగ్గర దించుతానని చెప్పాడు. అయితే, పని చూసుకుని టైమ్ వరకు వస్తానని వెళ్లిన తండ్రి ఎంత సేపటికీ రాకపోవడంతో.. ఎగ్జామ్‌కు లేటవుతుందని గాబరాగాబరాగా బస్టాండ్‌కు వెళ్లింది. అక్కడ ఆర్టీసీ బస్సు ఎక్కి ఎగ్జామినేషన్ సెంటర్‌కు చేరుకుంది. కానీ అప్పటికే 9.05 గంటలు దాటిపోవడంతో అధికారులు శరణ్యను ఎగ్జామ్ సెంటర్2లోనికి అనుమతించలేదు. దీనిపై శరణ్య కాలేజీ సిబ్బందిని, ఉన్నతాధికారులను సంప్రదించింది.

ఈ క్రమంలో తహశీల్దార్ సుజాత ఎగ్జామ్ సెంటర్‌కు చేరుకుని, సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ క్రమంలో శరణ్య 17 నిమిషాలు ఆలస్యంగా ఎగ్జామ్ సెంటర్ వద్దకు వచ్చినట్లుగా అధికారులు నిర్ధారించారు. దీంతో ఆమెను పరీక్షకు అనుమతించలేదు. తమ భవిష్యత్‌కు సంబంధించిన పరీక్షలు రాసేటప్పుడు కచ్చితంగా సమయపాలన పాటించాలని తహశీల్దార్ సూచించారు.

## మచిలీపట్నం పాల కేంద్రాల్లో తనిఖీలు

**మచిలీపట్నం,ఫిబ్రవరి 25(ఆర్ఎన్ఎ):** రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన కల్తీ పాల ఘటన నేపథ్యంలో ఏపీలోని వివిధ జిల్లాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల సరఫరా కేంద్రాలు, డైరీలపై తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం ఉదయం కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని పలు పాల కేంద్రాలపై అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సెంటర్, చిలకలపూడి ప్రాంతంలోని పాల కేంద్రాల్లోని పాలను ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు పరిశీలించారు. ఎస్.ఎస్ మిల్క్, జిల్లా పరిషత్ కృష్ణవేణి మిల్క్ డైరీ పాల కేంద్రాల నుంచి పాల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్స్‌కు పంపించారు. కొన్ని కేంద్రాల్లో ఎమ్మార్పీ, మ్యానుఫ్యాక్చరింగ్ డేట్ లేని, అత్యధిక కాలం ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన బాదం పాల ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. రాజమహేంద్రవరం ఘటనలో కల్తీ పాలు తాగడం వల్ల పలువురు మృతి చెందగా.. మరికొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.

## 2019 ఈస్టర్ బాంబు పేలుళ్ల కేసు

### శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ అరెస్ట్

**కొలంబో,ఫిబ్రవరి25(ఆర్ఎన్ఎ):** 2019 ఈస్టర్ బాంబు పేలుళ్ల కేసులో శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్‌ను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున రాజధాని శివారులో రిటైర్డ్ మేజర్ జనరల్ సురేష్ సల్లేను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈస్టర్ ఆదివారం పేలుళ్లకు కుట్ర పన్నడం, సహాయం చేయడం మరియు ప్రోత్సహించినందుకు ఆయనను అరెస్ట్ చేశారని అన్నారు. గోటబయ రాజపక్స అధ్యక్షుడైన తర్వాత 2019లో స్టేట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ (ఎస్ఐఎస్) చీఫ్‌గా సురేష్ పదోన్నతి పొందారని, ఆత్మాహుతి బాంబుదాడులకు సహకారం అందించారని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. సురేష్ ఇస్లామిక్ బాంబర్లతో సంబంధం కలిగి ఉన్నాడని, దాడికి ముందు వారిని కలిశారని బ్రిటన్ మీడియా 2023లో వెల్లడించింది. ఆ ఏడాది జరిగిన అధ్యక్ష ఎన్నికలను రాజపక్సకు అనుకూలంగా ప్రభావితం చేసేందుకు ఈ దాడిని కొనసాగించేందుకు ఆయన అనుమతించాడని ప్రజావేగు ఒకరు మీడియాకు తెలిపారు. 2019లో ఈస్టర్ పండుగ సమయంలో దేశవ్యాప్తంగా జరిగిన బాంబు పేలుళ్లలో 45మంది విదేశీయులు మరణించగా, 500మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే.

# వేంపల్లె నందీశ్వరాలయంలో ప్రతిష్ట

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్ జగన్




**పులివెందుల,ఫిబ్రవరి 25 (ఆర్ఎన్ఎ):** వైసిపి అధినేత వైఎస్ జగన్ రెండో రోజు పులివెందులలో పర్యటించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు వేంపల్లి మండలం నందిపల్లి నందీశ్వర ఆలయాన్ని వైఎస్ జగన్ సందర్శించారు. నందీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమంలో జగన్ పాల్గొన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆలయానికి రూ. 1.8 కోట్లు మంజూరు చేశారు. మొత్తం ఆరు కోట్ల రూపాయలతో దేవాలయ నిర్మాణం జరిగింది. ఈ కార్యక్రమం తర్వాత.. వైఎస్ జగన్ మధ్యాహ్నం నుంచి క్యాంపు కార్యాలయంలో ప్రజదర్బార్ నిర్వహించనున్నారు. అయితే దీనికి ముందుగా పులివెందుల నివాసం నుంచి బయలుదేరిన వైఎస్ జగన్ వైఎస్ రాజారెడ్డి సోదరిని పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు.

## యూరియా కోసం సిపిఎం ధర్నా

**నల్లగొండ,ఫిబ్రవరి 25(ఆర్ఎన్ఎ):** రాష్ట్రంలో రైతుల యూరియా కష్టాలు తప్పడం లేదు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నలకు కాంగ్రెస్ పాలనలో యూరియా కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. వానకాలం, యాసంగిలోనూ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఒక్క బస్తా యూరియా కోసం ఉదయం నుంచి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించింది.ప్రభుత్వం కొత్తగా యాప్ తీసుకొచ్చి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సూచించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా నల్లగొండలో యూరియా సమస్యలు తీర్చాలని సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

# ఉదయ్‌పూర్‌లో విరోష్ పెళ్లిసందడి

### హాజరవుతున్న అంబానీ కుటుంబం



**ఉదయ్‌పూర్,ఫిబ్రవరి 25(ఆర్ఎన్ఎ):** టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ,రష్మిక మందన్న వివాహ వేడుకలు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఘనంగా కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 26న జరగనున్న ఈ ప్రైవేట్ వెడ్డింగ్‌కు సంబంధించిన ప్రీవెడ్డింగ్ వేడుకలు ఇప్పటికే పీక్స్‌కు చేరుకున్నాయి. కేవలం 100 మంది అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుక జరగనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రముఖ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ కుటుంబం ఉదయ్‌పూర్‌కు చేరుకోవడంతో జోరుగా చర్చ మొదలైంది. ఆయనతో పాటు నీతా అంబానీ, కోకిలాబెన్ అంబానీ, ఆకాశ్ అంబానీ, శ్లోకా అంబానీ కూడా వచ్చినట్లు ప్రచారం సాగింది. దీంతో అంబానీ కుటుంబం విరోష్ వెడ్డింగ్‌కు హాజరవుతున్నారన్న వార్తలు వైరల్ అయ్యాయి. అయితే తాజా సమాచారం ప్రకారం అంబానీ కుటుంబం ఉదయ్‌పూర్ సందర్శనకు ఈ వివాహంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టమైంది. ఉదయ్‌పూర్ సమీపంలోని నాథ్‌ద్వారాలో ఉన్న శ్రీనాథ్ జీ ఆలయంలో దర్శనం కోసం అంబానీ కుటుంబ సభ్యులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆలయం వద్ద తీసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు వాటిని విరోష్ వెడ్డింగ్‌కి అటాచ్ చేశారు. అయితే ఇది కేవలం యాదృచ్ఛికమేనని, పెళ్లికి సంబంధం లేదని సమాచారం.

ఈ సెలబ్రిటీ వివాహం పూర్తిగా ప్రైవేట్ వేడుకగా జరుగుతోంది. ఇప్పటికే ఉదయ్‌పూర్ విమానాశ్రయంలో కనిపించిన వారిలో దర్శకుడు తరుణ్ భాస్కర్, నటి ఈషా రెబ్బా, నటి ఆషికా రంగనాథ్, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తదితరులు ఉన్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా హాజరయ్యే అవకాశమున్నట్లు టాక్ వినిపిస్తోంది.వివాహ విందు పూర్తిగా దక్షిణాది శైలిలో ఉండబోతోందని సమాచారం. అతిథులకు అరిటాకుల్లో భోజనం వడ్డించనున్నారు. ప్రత్యేకంగా కొబ్బరి నీళ్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి సరదా క్రీడలతో సందడి చేశారు. ఫిబ్రవరి 26, 2026న ప్రధాన వివాహం జరగనుండగా, సినీ పరిశ్రమ స్నేహితుల కోసం మార్చి 4న ప్రత్యేక విందు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. మొత్తానికి, అంబానీలు ఉదయ్‌పూర్‌లో ఉన్నారన్న విషయం నిజమే అయినప్పటికీ, అది విజయ్ దేవరకొండ,రష్మిక మందన్న పెళ్లితో సంబంధం లేదని సమాచారం.

## చలికాలంలో మీరు తుమ్ములతో బాధపడుతున్నారా?

**- దీన్ని ఆపడానికి కొన్ని సహజ మార్గాలు ఇక్కడ ఉన్నాయి!**



జలుబు, అలెర్జీ లేదా ఏదైనా వాసన కారణంగా చాలా మందికి తరచుగా తుమ్ము వస్తుంది. ఎప్పుడైనా ఈ రకమైన వరుసగా తుమ్ములు వస్తుంటాయి. కొన్నిసార్లు ఈ తుమ్ము శ్వాస తీసుకోవడానికి ఇబ్బందికి కారణమవుతుంది. తుమ్ము అనేది చికాకులు మరియు అంటు సూక్ష్మ క్రిములను వదిలించు కోవడానికి శరీరం యొక్క సహజ మార్గం. ఇటువంటి ఇన్ఫెక్షన్లను ఎదుర్కోవటానికి సహజమైన మార్గాలు ఖచ్చితంగా చేయవచ్చు. ఇది ప్రస్తుతం శీతాకాలం కాబట్టి, చాలా మంది జలుబు మరియు తీవ్రమైన తుమ్ముతో బాధపడుతుంటారు.

సిట్రస్ పండ్లు ఫ్లేవనాయిడ్లు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్, సిట్రస్ పండ్లైన నారింజ, నిమ్మకాయలు మరియు ద్రాక్షపండు వంటి వాటిలో నిర్దిష్ట మొక్కల రసాయనాలు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడతాయి. ఇది శరీరంపై దాడి చేసే అవాంఛిత బ్యాక్టీరియా మరియు ఇతర అలెర్జీలతో పోరాడటానికి సహాయపడుతుంది. చలికాలం లేదా శీతాకాలంలో రోజూ ఈ పండ్లను తింటే మీ శరీరం మెరుగుపడుతుంది.

**జింక్ ఆహారాలు**

జలుబు లేదా తుమ్ములు సమస్య ఉన్నవారికి జింక్ తినడం మంచిది. మీరు వెంటనే సమస్యను వదిలించుకోవాలని ఆలోచిస్తుంటే, జింక్ అధికంగా ఉండే ఆహారాలు లేదా సప్లిమెంట్లను తీసుకోండి. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది మరియు త్వరగా నయం చేస్తుంది. ఇటువంటి జింక్ చిక్కుళ్ళు, కాయలు, విత్తనాలు, ధాన్యాలలో పుష్కలంగా ఉంటాయి.

**గూస్బెర్రీ**

గూస్బెర్రీలో యాంటీఆక్సిడెంట్ మరియు యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. దీన్ని గూస్బెర్రీ రూపంలో లేదా రసం రూపంలో తినవచ్చు. రోజుకు రెండు, మూడు సార్లు తరచుగా తుమ్ములు వస్తుంటే గూస్బెర్రీస్ తినడం వల్ల తుమ్ముల సమస్య నుండి త్వరగా బయటపడవచ్చు.

నల్ల ఏలకులు సుగంధ మసాలాలలో ఒకటి బ్లాక్ కార్డమమ్(బ్లాక్ ఏలకులు) అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. ఈ మసాలా భారతీయ వంటలో ఉపయోగించే ఒక సాధారణ పదార్థం. తుమ్ముతో బాధపడేవారు రోజూ రెండు, మూడు నోట్లో వేసుకుని నమలాలి. నల్ల ఏలకుల నూనె చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఎందుకంటే ఇది శ్వాస మార్గంలోని శ్లేష్మం ప్రవాహాన్ని సాధారణీకరించడానికి సహాయపడుతుంది. ఈ నూనెతో సున్నితంగా మసాజ్ చేయండి.

**అల్లం**

అల్లం యాంటీ సెప్టిక్ లక్షణాలను కలిగి ఉంటుంది , జలుబును నయం చేయడంలో సహాయపడుతుంది. ఒక బాణలిలో నీరు ఉడకబెట్టిన తర్వాత, 3 అంగుళాల పొడవున్న అల్లం వేడినీటిలో వేసి ఉడకబెట్టి, 2 టేబుల్ స్పూన్ల తేనె వేసి నిద్రవేళకు ముందు లేదా తుమ్ములతో ఇబ్బంది పడుతున్న సమయంలో త్రాగాలి.

**తులసి**

పవిత్ర తులసి అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. తులసి ఆకు శక్తివంతమైన యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంది. ఇది ప్రమాదకరమైన ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. అందులో 1 కప్పు నీరు పోసి, 3-4 తులసి ఆకులను వేసి బాగా ఉడకబెట్టి రోజూ త్రాగాలి. మీరు 2-3 రోజులు తాగడం కొనసాగిస్తే, మీరు సానుకూల మార్పును చూడవచ్చు.

**వెల్లుల్లి**

వెల్లుల్లిలోని పదార్థాలు ఇబ్బందికరమైన అలెర్జీ సమస్యతో పోరాడటానికి సహాయపడతాయి. వెల్లుల్లిలో ఒక ప్రత్యేకమైన పదార్థం అల్లిసిన్, శ్వాసకోశంలో శ్లేష్మం పెరగడాన్ని నివారిస్తుంది మరియు రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కాబట్టి తుమ్ముల సమస్య నుండి బయటపడటానికి, కొన్ని వెల్లుల్లి పళ్ళ మధ్యన ఉంచండి తర్వాత బ్రష్ చేసి, శుభ్రం చేసుకోండి.



# భరించలేని తలనొప్పా!

**- ఏ భాగంలో మీకు ఎక్కువ నొప్పి కలిగిస్తోందో తెలుసా?**



తలనొప్పి అనేది తలలో ఒక నిర్దిష్ట భాగంలో సంభవించే నొప్పి. నొప్పి ఎంతవరకు కేంద్రీకృతమై ఉంటుందో దాని ఆధారంగా చికిత్స అందించబడుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రపంచంలోని చాలా మందికి తరచూ తలనొప్పితో బాధపడుతున్నారని నివేదిస్తారు. కొన్నిసార్లు నొప్పి ప్రసవమంత తీవ్రంగా ఉంటుంది. కొన్ని తేలికపాటి నుండి మధ్యస్తంగా బాధాకరంగా ఉంటాయి. మందులు తీసుకోవడం ద్వారా సులభంగా నయమవుతాయి.

తలనొప్పి నిరంతరం పునరావృతమవుతుంటే, ఇది ఒక తీవ్రమైన విషయం, ఇది నిపుణుడిచే చెక్ చేయబడాలి. తలనొప్పి ఏ వైపు తీవ్రంగా ఉందో, ఎంతసేపు ఉంటుంది, మరియు ఇతర లక్షణాలు గమనించి తెలుసుకోవడం ద్వారా ఏ రకమైన తలనొప్పో కనుగొనవచ్చు. ఇది తీవ్రమైన, నాన్-సీరియస్ రకాలను గుర్తించగ లదు మరియు వాటిని తగిన విధంగా చికిత్స చేస్తుంది. సాధారణంగా తలనొప్పిలో ఎనిమిది రకాలు ఉన్నాయి. రండి, ప్రతి తలనొప్పిపై కొన్ని విలువైన సమాచారాన్ని తెలుసుకుందాం .... మైగ్రేన్ తలనొప్పి (మైగ్రేన్ హెడేక్) తలనొప్పి ఈ రూపం ఆత్మహత్యను ప్రేరేపించేంత శక్తివంతమైనది. నిరాశపరిచే విషయం ఏమిటంటే, ఒకసారి నొప్పి వస్తే, అది కొన్ని రోజులు కొనసాగుతుంది. సాధారణంగా ఇది తల ఎడమ లేదా కుడి వైపున కేంద్రీకృతమై ఉంటుంది, కాంతి, శబ్దానికి చాలా సున్నితంగా ప్రభావం చూపుతుంది. తీవ్రమైన కాంతి లేదా తీవ్రమైన తరంగాలు (అరుపు, వయోలిన్ ఎత్తైన తరంగం వంటివి) నొప్పిని పెంచుతాయి. కొంత మందికి వికారం, వాంతులు కూడా ఎదురవుతాయి. నొప్పి గరిష్ట స్థాయికి చేరుకున్నప్పుడు, కంటి దృష్టి కేంద్ర భాగం అదృశ్యమవుతుంది, అంటే మీరు ఆ సమయంలో ఒక వ్యక్తిని చూస్తే, వారి తల ఉండదు! ఈ తలనొప్పి పురుషుల కంటే మహిళలను మూడు రెట్లు ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. (పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ లేదా మెంటల్ ట్రామా) ఉన్నవారికి తలనొప్పి వచ్చే అవకాశం ఉంది. సరైన నిద్ర లేకపోవడం, ఆహారం తీసుకోకపోవడం, నిర్జలీకరణం, మెదడులో స్రవాలు హెచ్చుతగ్గులు మరియు కొన్ని పదార్థాలకు అలెర్జీలు రావడం వల్ల ఈ తలనొప్పి వస్తుంది. నెమ్మదిగా తల వెనుక నుండి (మెడ ఎగువ భాగం) మొదలవుతుంది, నొప్పి కొద్ది నిమిషాల్లోనే తల మధ్యలో చేరుతుంది. ఈ సమయంలో కళ్ళు ముందు మెరుపు మెరుస్తున్నప్పుడు చిన్న మచ్చలు కనిపిస్తాయి, క్షితిజ సమాంతర రేఖలు, కనిపించే అన్ని కాంతి వనరుల క్ర. ఈ దశకు ముందు పిల్ లేదా మామోగ్రామ్ వంటి ఈ బాధాకరమైన నూనె నుదిటిపై పూసినట్లయితే, అది మరింత తీవ్రం కాకుండా నిరోధించవచ్చు. లేకపోతే, ఒకసారి నొప్పి తీవ్రంగా ఉంటే, నొప్పి పూర్తి స్థాయిని చేరకముందే డాక్టర్ ను కలవడం అవసరం. మైగ్రేన్ తలనొప్పి తర్వాత మూడింట రెండు వంతుల మైగ్రేన్ తలనొప్పి మాత్రమే వస్తుందని గణాంకాలు చెబుతున్నాయి మరియు తలనొప్పికి ముందు వారు తగిన మందులు తీసుకుంటారు. నిజానికి, వారిలో 38 శాతం మందికి ఔషధం అవసరం. ఏదైనా స్థాయి నొప్పి, ముఖ్యంగా మీరు నెలకు కనీసం మూడు నుండి ఆరు రోజులు ఈ రకమైన నొప్పిని అనుభవిస్తే, వైద్యుడిని సంప్రదించడం చాలా అవసరం. మానసిక ఒత్తిడి వల్ల తలనొప్పి: (టెన్షన్ తలనొప్పి) ఇది ఎక్కువగా ఉండదు, కానీ తల లోపలి భాగంలో బలంగా ఉంటాది. ఒక విధంగా చెప్పాలంటే, మెదడు రబ్బరు బ్యాండ్ టైట్‌గా చుట్టబడినట్లు అనిపిస్తుంది. మానసిక ఒత్తిడికి గురైన ఏ వ్యక్తి అయినా ఈ బాధను అనుభవించవచ్చు. మనకు తలనొప్పి అని ఏప్పుడు అనిపించినా, మీకు ఔషధ దుకాణంలో ఉచితంగా నొప్పి నివారణ మందులు తీసుకుని తింటే ఈ నొప్పి తక్కువ సమయంలోనే పోతుంది. అది తగ్గకపోతే, అలాగే నొప్పి పెరుగుతూ ఉంటే వైద్యుడిని సంప్రదించడం అవసరం. సైనస్ తలనొప్పి ఈ రకమైన తలనొప్పి ముక్కు మరియు నుదిటి వెనుక (కళ్ళ మధ్య), కంటి దిగువ భాగంలో ఎముకల వెనుక నొప్పిని కలిగిస్తుంది. అదనంగా, పొత్తి కడుపులో నొప్పి, మరియు కొరికేటప్పుడు పై దంతాలలో సలుపు, అరుదైన సందర్భాల్లో ఈ సమయంలో వాసన కూడా పసిగట్టలేకపోవచ్చు. సైనస్ లేదా జఠరిక అంటే మన ముక్కు పైభాగానికి మరియు నుదిటి మధ్య ఉన్న బోలు భాగం. ఈ నొప్పి తీవ్రత సంక్రమణ తీవ్రతను అనుసరిస్తుంది. మైగ్రేన్ తలనొప్పి లక్షణాలు తరచుగా సైనస్ తలనొప్పిగా తప్పుగా నిర్ధారిస్తారు ఎందుకంటే అవి సైనస్ తలనొప్పిని పోలి ఉంటాయి. సైనస్ తలనొప్పిలో 90% వరకు వాస్తవానికి మైగ్రేన్ తలనొప్పి. పిడుగు తలనొప్పి! చప్పట్లు కొట్టే సమయంలో శబ్దం విస్ఫోటనం చెందుతున్నప్పుడు, ఈ రకమైన తలనొప్పి అకస్మాత్తుగా, బాధాకరమైన తలనొప్పిగా అదృశ్యమవుతుంది, ఒక నిమిషం పాటు ఉండదు. సాధారణంగా వేగాన్ని తగ్గించి ఐదు నిమిషాలు పడుతుంది. ఏదేమైనా, ఈ రకమైన తలనొప్పి ఏదైనా ఆరోగ్య పరిస్థితికి తీవ్రమైన మరియు అత్యవసర మరియు ప్రాణాంతక పరిస్థితిని కలిగిస్తుంది. ఈ రకమైన తలనొప్పి పక్షవాతం, మెదడులో రక్తస్రావం, మెదడులోని రక్త నాళాల చీలిక, మెదడు అనూరిజం, మెదడులో ఇన్ఫెక్షన్, మెదడులో రక్త ప్రవాహాన్ని అడ్డుకోవడం లేదా మెదడు వ్యవస్థ నుండి అవసరమైన ద్రవం లీకేజీగా కనిపిస్తుంది. క్లస్టర్ తలనొప్పి సాధారణంగా ఈ రకమైన తలనొప్పి కళ్ళ వెనుక భాగంలో కనిపిస్తుంది. నొప్పి ఉన్నప్పుడు, కళ్ళు ఎర్రబడినట్లు, రెప్పపాటు, చెమట, కళ్ళ వాపు కనిపిస్తాయి. అరుదుగా, ముక్కు నుండి, కళ్ళ నుండి నీళ్లు రావచ్చు. నొప్పి సుమారు పదిహేను నిమిషాల నుండి మూడు గంటల వరకు ఉంటుంది మరియు షెడ్యూల్ ప్రకారం పునరావృతమవుతుంది. కొంతమందిలో ఇది రోజుకు నాలుగు సార్లు కనిపిస్తుంది. ఇది శీతాకాలంలో, మహిళల కంటే పురుషులలో ఎక్కువగా కనిపిస్తుంది. నొప్పి తగ్గిన తర్వాత, వెంటనే వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం.

అలెర్జీ తలనొప్పి ఏదైనా అలెర్జీ పదార్థానికి శరీర ప్రతిచర్యలలో తలనొప్పి ఒకటి. అందువల్లనే కొన్ని పువ్వులు (సంపి, మడగాస్కర్ జాస్మిన్, జాస్మిన్ సాంబాక్, హైసింత్స్, పేపర్ వైట్ హైసింత్స్, నార్సిసస్ మొదలైనవి) చూడ కూడదని పెద్దలు అంటున్నారు. తలనొప్పి తరువాత, ముక్కు నిరంతరం కారుతుంది, నిరంతర తుమ్ము, కళ్ళ నుండి నీరు నడుస్తుంది. సాధారణంగా, వసంత రుతువులో పువ్వు పుప్పొడి చాలా ఎక్కువగా ఉన్నప్పుడు ఫ్లవర్ పుప్పొడి అలెర్జీ తలనొప్పిని రేకెత్తిస్తుంది. మీ తలనొప్పికి ఏ కణం కారణమవుతుందో తెలుసుకోవడానికి మీరు ఆ సమయంలో అన్ని చిన్న విషయాలపై శ్రద్ధ వహించాలి. మీ ఇంట్లో పెరిగే మొక్కలు, రోడ్డు పక్కన పెరిగిన పూల చెట్లు (అకాసియా వంటివి) అలెర్జీ పుప్పొడిని కలిగి ఉన్నాయని, మీకు తలనొప్పి ఉందని (లేదా మీకు తలనొప్పి వచ్చినప్పుడు మీరు ఒక చెట్టును విడిచిపెట్టారని) కనుగొన్నప్పుడు, ముఖ్యంగా ఈ రోజు కనుగొనడం చాలా సులభం. విమానం తలనొప్పి విమానంలో ప్రతి పన్నెండు మందిలో ఒకరు విమానం పైకి లేచినప్పుడు నెమ్మదిగా తలనొప్పితో బాధ పడుతుంటారు. విమానం లోపల ఉన్న కృత్రిమ పీడనం భూమి పీడనానికి కొద్దిగా భిన్నంగా ఉండటమే దీనికి కారణం. సాధారణంగా ఇది తల కుడి లేదా ఎడమ వైపున ఉన్న కేంద్రం నుండి దూరంగా ఉంటుంది. ఈ పరిస్థితి నుండి తప్పించుకోవడానికి, విమానానికి ముందు పుష్కలంగా నీరు తాగటం అవసరం మరియు ఎటువంటి ఉద్రిక్తతలకు గురికాకూడదు. తలనొప్పి విషయంలో, సాధారణ తలనొప్పి మాత్రమే సరిపోతుంది. శ్రమతో తలనొప్పి పేరుకు తగ్గట్లుగా, శరీరం, ముఖ్యంగా మెదడు అధికంగా పనిచేసేటప్పుడు (ఎడతెగని శ్రమ) ఈ రకమైన తలనొప్పి వస్తుంది. శరీరం అధికంగా శ్రమ కలిగినప్పుడు కూడా కొన్నిసార్లు ఈ రకమైన తలనొప్పి వస్తుంది. తీవ్రమైన సందర్భాల్లో నొప్పి ఐదు నిమిషాల నుండి మూడు రోజుల వరకు ఎక్కడైనా ఉంటుందని అమెరికన్ మైగ్రేన్ ఫౌండేషన్ పేర్కొంది. రెగ్యులర్ లిఫ్టింగ్, ముఖ్యంగా అధిక బరువు, తలనొప్పికి దారితీస్తుంది. ఈ నొప్పి సాధారణంగా తల యొక్క ఒకటి లేదా రెండు వైపులా చిటికెడుతో ఉంటుంది, ముఖ్యంగా నుదిటి వైపు మరియు చెవి మధ్యలో ఉంటుంది. నుదిటి పక్కన ఉన్న నాడి స్పష్టంగా కనిపిస్తుంది. సాధారణంగా ఈ నొప్పి అరుదైన సందర్భాల్లో మాత్రమే అనుభవించ బడుతుంది, గరిష్టంగా ఆరు వారాల తర్వాత అదృశ్యమవుతుంది. అందువల్ల నొప్పికి కారణమేమిటో గ్రహించడం ద్వారా పరిస్థితిని రిస్క్ చేయకుండా ఉండటానికి ఇది చాలా సరైన ముందు జాగ్రత్త, చికిత్స. కఠినమైన కార్యకలాపాల మధ్య విశ్రాంతి, నిద్ర పుష్కలంగా పొందడం కూడా అవసరం.

# పెళ్లి పేరుతో యువతులకు మోసం

**వెలుగులోకి వచ్చిన యువకుడి బాగోతం... ఉప్పల్‌లో ఓ పాస్టర్‌పై మహిళ ఫిర్యాదు... రంగంలోకి దిగి దర్యాప్తుచేస్తున్న పోలీసులు**

**హైదరాబాద్,ఫిబ్రవరి25(ఆర్ఎన్ఎ):** పెళ్లి పేరుతో యువతులకు వల వేస్తున్నారు కేటుగాళ్లు. వారిని శారీరకంగా ఉపయోగించుకుని.. పైగా డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. తాజాగా ఇలాంటి ఘటనలు రెండు వెలుగులోకి వచ్చాయి. షాదీ డాట్ కామ్‌లో పరిచయం చేసుకుని మహిళలను మోసం చేస్తున్న వ్యక్తిపై ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. మరోవైపు ప్రేమ పేరుతో వల విసురుతున్న ఓ పాస్టర్ బాగోతం వెలుగులోకి వచ్చింది. పెళ్లి కోసం ఈ మధ్య చాలా మంది మ్యారేజ్ వెబ్‌సైట్లను ఆశ్రయిస్తున్నారు. అందులో షాదీ డాట్ కామ్ కూడా ఒకటి. కానీ కొంత మంది కేటుగాళ్లు.. ఆయా వెబ్‌సైట్స్‌లో తమను తాము పెళ్లి కాని యువకులుగా రిజిస్టర్ చేసుకుంటున్నారు. ఆ తర్వాత మెల్లగా ఫోన్ నంబర్ సేకరించి.. మాయమాటలతో యువతులకు వల విసురుతున్నారు. ఐతే ఒంటరి మహిళలనే వారు టార్గెట్ చేస్తూ అందిన కాడికి దోచేస్తున్నారు. చిన్న రంగా నాయక్ హైదరాబాద్ మల్కాజిగిరిలో ఉంటున్నాడు. షాదీ డాట్ కామ్‌లో ఒంటరి మహిళలను ఇతడు టార్గెట్ చేసుకుంటున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మిస్తాడు. తన మాయ మాటలతో నిజంగానే పెళ్లి చేసుకుంటానని నమ్మేలా చేయడం ఇతని స్పెషాలిటీ. అలాగే బాలాపూర్ మండలం మీర్‌పేట్‌లో ఉండే భవానీ అనే మహిళకు వల విసిరాడు. ఆమె ఫోన్ నంబర్ తీసుకుని.. పెళ్లి చేసుకుంటానని పూర్తిగా నమ్మించాడు. చివరకు తనకు ఖర్చులు ఉన్నాయంటూ క్రమక్రమంగా ఆమె వద్ద నుంచి 30 లక్షల రూపాయల వరకు వసూలు చేశాడు. తన ఖర్చుల కోసం అవసరాలు తీరిపోగానే.. ఇల్లు నిర్మించుకుందామని చెప్పాడు. కానీ డబ్బులు తీసుకుని ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో భవానీ షాకైంది. గతంలోనూ ఇలాగే తప్పుడు పేర్లతో షాదీ డాట్ కామ్‌లో చిన్న రంగనాయక్ పలువురు మహిళలను మోసం చేసినట్లు భవానీ గుర్తించింది. అలాంటి వ్యక్తిని అరెస్ట్ చేసిన కఠిన శిక్ష పడేలా చేయాలని కోరుతోంది. మరోవైపు హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఓ పాస్టర్ బాగోతం వెలుగులోకి వచ్చింది. కట్టుకున్న భార్యకు విడాకులు ఇచ్చేసి.. ప్రేమ పేరుతో మహిళలకు వల విసురుతున్నాడు. అతని పేరు సందీప్ వడేగర్. ఉప్పల్‌లో నివాసం ఉంటూ లివింగ్ వే చర్చి పాస్టర్‌గా పని చేస్తున్నాడు. తన భార్యకు విడాకులు ఇచ్చేశాడు. ప్రేమ, పెళ్లి పేరుతో ఓ మహిళను ట్రాప్ చేశాడు. ఆమెకు శారీరకంగా దగ్గరయ్యాడు. ఆమె ప్రభుత్వోద్యోగం చేస్తుండడంతో వచ్చిన జీతం తీసుకుంటూ ఆమెను నిత్యం వేధిస్తున్నాడు. ఐతే అతని వేధింపులు తట్టుకోలేక పాస్టర్ సందీప్ ఆగడాలపై ఆ మహిళ ఆరా తీసింది. సందీప్‌కు అతని స్నేహితుడి భార్యతో వివాహేతర బంధం ఉన్నట్లు గుర్తించింది. దీనిపై అతన్ని నిలదీయడంతో ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరించాడు. సందీప్ బెదిరిం చడంతో.. ఆ మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఈ క్రమంలో నిందితుడు పాస్టర్ సందీప్ వెనుక సికింద్రాబాద్‌లోని మరో చర్చి ఫాదర్ ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం పోలీసులు మహిళ స్టేట్‌మెంట్ రికార్డ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అసెంబ్లీని సందర్శించిన విద్యార్థులు

**విద్యార్థులతో పవన, అయ్యన్నల ఫోటో**



**అమరావతి,ఫిబ్రవరి25(ఆర్ఎన్ఎ):** బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం అమృతలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం రాష్ట్ర అసెంబ్లీని సందర్శించారు. అసెంబ్లీ సమావేశాలు వీక్షించేలా విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే 30 మంది 9వ తరగతి విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు కె. నిరీక్షణరావు ఆధ్వర్యంలో అసెంబ్లీ సమావేశాలను వీక్షించారు. అసెంబ్లీ జరుగుతున్న తీరును విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఫోటోలు దిగారు. పాఠశాల సోషల్ టీచర్ మాజేటి వెంకటేశ్వరరావు, సైన్స్ ఉపాధ్యాయురాలు స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

# 'మీ సేవ' మొబైల్ ఆప్ ప్రారంభం

**బస్ టిక్కెట్ పొందే సౌకర్యం... ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్,ఫిబ్రవరి 25(ఆర్ఎన్ఎ):** టీజీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సౌలభ్యం కోసం మీసేవ మీ టికెట్ మొబైల్' యాప్ ద్వారా సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. మంగళవారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ , రవాణా శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్ , తెలంగాణ ఆర్టీసీ వీసీ / ఎండీ వై.నాగిరెడ్డి, మీసేవ కమీషనర్ రవికిరణ్‌తో కలిసి మీ మొబైల్ ఆప్ ను ఆవిష్కరించారు. ఈ సరికొత్త విధానం ద్వారా మీ టికెట్ మొబైల్ యాప్ క్షఖా సేవలను కూడా అనుసంధానిస్తుంది. ప్రయాణీకులు సుదూర ప్రయాణాలు, ఇంటర్‌సిటీ బస్సు టిక్కెట్లను డిజిటల్‌గా బుక్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది.గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో ఐదు రకాల బస్ పాస్‌లు పొందే సౌకర్యం కలుగనుంది.మీ టికెట్ మొబైల్




యాప్ ద్వారా ఇప్పుడు ఐదు కేటగిరీల సిటీ బస్ పాస్‌లు డిజిటల్‌గా అందుబాటులో ఉన్నాయి. బస్ పాస్ మాడ్యూల్ హైదరాబాద్ నగరంలోని ప్రయాణీకులకు మొబైల్ యాప్ ద్వారా నెలవారీ బస్ పాస్‌లను డిజిటల్‌గా తీసుకోవడానికి మరియు పునరుద్ధరించడానికి వీలు కల్పిస్తుంది.అందుబాటులో గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో కార్యకలాపాల కోసం టి 24 టికెట్‌ను మొబైల్ యాప్‌లో విలీనం చెయ్యడం జరిగింది. టి 24 టికెట్ అనేది 24 గంటల డిజిటల్ ట్రావెల్ పాస్, ఇది యాక్టివేషన్ సమయం నుండి సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ మరియు మెట్రో డీలక్స్ బస్సు సర్వీసులలో అపరిమిత ప్రయాణాన్ని అనుమతిస్తుంది.టి-24 టికెట్ పర్యాటకులకు, అప్పుడప్పుడు ప్రయాణించేవారికి మరియు ఒకే రోజులో బహుళ ట్రిప్పులు అవసరమయ్యే ప్రయాణీకులకు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో టిజీఎస్ ఆర్టీసీ ఈడీలు మునిశేఖర్, వెంకన్న, ఖుస్రో షా ఖాన్ ,రాజశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప , సిటీఎం శ్రీదేవి సిఈ(ఐటి) శ్ శ్రీదేవి,హైదరాబాద్ , రంగారెడ్డి ఆర్ఎం లు సుధాపరిమళ , శ్రీలత పలువురు అధికారులు పాల్గొన్నారు

# ఇంటర్, టెన్త్ విద్యార్థులకు ఆర్టీసీ సేవలు

**హాల్‌టిక్కెట్ చూపిస్తే కోరిన చోట స్టాప్**

**హైదరాబాద్,ఫిబ్రవరి25(ఆర్ఎన్ఎ):** పరీక్షలు జరిగే రోజుల్లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ హాల్ టికెట్లు చూపిస్తే కోరిన చోట బస్సు ఆపేలా వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు, మార్చి 14వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరగనుండటంతో.. పరీక్షల సమయంలో అదనంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకున్నట్టు ఆర్టీసీ అధికారులు వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు బస్సుల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం అధికారులను ఆదేశించారు. పరీక్షల సమయంలో స్టాప్ లేకున్నా.. కోరిన చోట బస్సులు ఆపి విద్యార్థులను దింపేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.




# బాలీవుడ్‌కు పొలిశెట్టి పంచ్



ఇప్పుడు తెలుగులో వంద కోట్ల హీరోగా ఎదిగాడు నవీన్ పొలిశెట్టి. సంక్రాంతికి విడుదలైన తన చివరి చిత్రం అనగనగా ఒక రాజు ఈ ఘనత సాధించింది. ఈ సినిమా అంత పెద్ద విజయం సాధించింది అంటే అందులో నవీన్ క్రెడిటే అత్యధికం. నటుడిగానే కాక రైటర్‌గానూ ఈ సినిమా విజయంలో అతను కీలక పాత్ర పోషించాడు. దీని కంటే ముందు అతడి నుంచి మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి, జాతిరత్నాలు, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ లాంటి సక్సెస్ ఫుల్ సినిమాలు వచ్చాయి. కానీ అంతకంటే ముందు నటుడిగా నిలదొక్కుకోవడానికి అతను చాలా కష్టాలే పడ్డాడు. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్, 1 నేనొక్కడినే సహా పలు చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు చేశాడు. బాలీవుడ్‌కు వెళ్లి అవకాశాల కోసం చాలానే ప్రయత్నించాడు. అక్కడ షార్ట్ ఫిలిమ్స్ ద్వారా పేరు సంపాదించాక చిచ్చోరే సినిమాలో అవకాశం అందుకుని మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. నటుడిగా, మోడల్‌గా బాలీవుడ్‌లో ప్రయత్నాలు చేసేటపుడు తాను ఎదుర్కొన్న విచిత్రమైన అనుభవం గురించి నవీన్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడాడు.

బాలీవుడ్లో మేల్ ఆర్టిస్టులకు యాక్టింగ్ టాలెంట్ కంటే కూడా సిక్స్ ప్యాక్ ఉందా లేదా అన్నదే అక్కడ ముఖ్యం కావడం తనకు ఆశ్చర్యం కలిగించినట్లు నవీన్ చెప్పాడు. తాను ముంబయిలో ఆడిషన్స్ కోసం వెళ్లినపుడు సిక్స్ ప్యాక్ చేసుకుని రమ్మని చెప్పినట్లు నవీన్ వెల్లడించాడు. సిక్స్ ప్యాక్ లేనందుకు తనను రిజెక్ట్ చేశారని కూడా అతను చెప్పాడు. ఐతే ఒక అథ్లెట్ పాత్ర చేయాల్సినపుడు సిక్స్ ప్యాక్ చేయమంటే అది అవసరమే కాబట్టి చేయడానికి ఓకే అని.. కానీ పాత్రతో సంబంధం లేకుండా సిక్స్ ప్యాక్ చేయాలనడమేంటో తనకు అర్థం కాలేదని అతనన్నాడు. తనను రిజెక్ట్ చేసింది చిప్స్ అడ్వర్టైజ్మెంట్ మోడల్‌గా అని.. సిక్స్ ప్యాక్ ఉన్నవాడు చిప్స్ ఎందుకు తింటాడో తనకు అంతుబట్టలేదని నవీన్ వ్యాఖ్యానించాడు. బాలీవుడ్‌లో సిక్స్ ప్యాక్స్ పట్ల ఎలాంటి మోజు ఉంటుందో నవీన్ ఈ ఉదాహరణతో బట్టబయలు చేశాడు. సల్మాన్ ఖాన్, హృతిక్ రోషన్ లాంటి హీరోల ప్రభావంతో బాలీవుడ్లో హీరో కావాలంటే సిక్స్ ప్యాక్ ఉండాల్సిందే అన్న ఒక ముద్ర పడిపోవడానికి దీనికి కారణమని చెప్పొచ్చు.


# శర్వానంద్ భోగికి అసలైన ఛాలెంజ్



2026 శర్వానంద్ కు చాలా స్పెషల్ ఇయర్ గా నిలవబోతోంది. సంక్రాంతి పండక్కు విపరీతమైన పోటీ మధ్య ‘నారి నారి నడుమ మురారి’ విజయం సాధించగా ఏప్రిల్ లో ‘బైకర్’ రూపంలో సరికొత్త మేకోవర్ తో ప్రేక్షకులను పలకరించబోతున్నాడు. ఈ రెండు చాలని అభిమానులు సంతృప్తి పడతారేమో. నో ఛాన్స్. మూడోది కూడా వస్తోంది. సంపత్ నంది దర్శకత్వంలో రూపొందుతున్న ‘భోగి’ ఆగస్ట్ 28 విడుదల చేయబోతున్నట్టు టీమ్ అధికారికంగా ప్రకటించింది. మంచి డేట్లకు కాంపిటీషన్ ఎక్కువగా ఉండటంతో ముందస్తు ప్లానింగ్ తో ఆరు నెలల ముందే రిలీజ్ స్లాట్ లాక్ చేసుకుంది. ఇక అసలు విషయమైన రిస్కుకు వద్దాం. ఆగస్ట్ 28 చాలా మంచి డేట్ అయినప్పటికీ దానికి కేవలం వారం రోజుల ముందే ది ప్యారడైజ్ వచ్చి ఉంటుంది. దాని మీద ఉన్న బజ్ తెలిసిందే. ఆయా షేర్ పాట వచ్చాక అంచనాలు రెట్టింపయ్యాయి. ప్యాన్ ఇండియా రేంజ్ లో రూపొందుతున్న ప్యారడైజ్ కనక బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకుంటే దాని ప్రభావం ఎంతలేదన్నా సులభంగా రెండు మూడు వారాలు ఉంటుంది. ఆ మేనియాలో జనాలకు ఇతర సినిమాలు అంత ఈజీగా కనెక్ట్ కావు. అయినా అర్ భోగి టీమ్ రిస్క్ కు రెడీ అందంటే కంటెంట్ ఏదో బలంగా ఉన్నట్టే. అరవై దశకం బ్యాక్ డ్రాప్ లో రూపొందిన ఈ యాక్షన్ డ్రామాలో శర్వానంద్ లుక్ షాకింగ్ గా ఉంది. ఇప్పటిదాకా చేయని ఊర మాస్ అవతారాన్ని శర్వానంద్ భోగిలో చేస్తున్నాడు. పెద్ద ఎత్తున సెట్లు వేశారు. అవుట్ ఫుట్ ఓ రేంజ్ లో వస్తోందని యూనిట్ టాక్ ఉంది. మరి తక్కువ గ్యాప్ లో ప్యారడైజ్ తో తలపడేందుకు సిద్ధం కావడం ఆసక్తి రేపుతోంది. అయినా ఇప్పుడున్న పరిస్థితుల్లో అనౌన్స్ మెంట్ల తర్వాత కూడా ఎవరు మాట మీద ఉంటారో గ్యారెంటీగా చెప్పలేని సంకటం నెలకొంది. ప్రభాస్ నుంచి అడివి శేష్ దాకా అందరిదీ ఇదే కథ. అలాంటిది చాలా దూరంలో ఉన్న ఆగస్ట్ రిలీజులు ఖచ్చితంగా మాట మీద ఉంటాయా అంటే చెప్పలేం. ఉంటే మాత్రం నాని, శర్వా మధ్య రసవత్తరమైన మాస్ యుద్ధం చూడబోతున్నాం.

# నాని టార్గెట్ స్పష్టంగా ఉంది

నిన్న విడుదలైన ది ప్యారడైజ్ మొదటి పాట ఆయా షేర్ సోషల్ మీడియాని ఊపేస్తోంది. గతంలో ఇలాంటి పాటలు ఎవరూ చేయలేదని కాదు కానీ నాని కెరీర్ లో ఇంత మాస్ టచ్ ఉన్న సాంగ్ అరుదు కావడంతో సినీ ప్రియులు షాకవుతున్నారు. అయితే నాని తన కథల ఎంపికలో అనుసరిస్తున్న విధానం చూస్తుంటే భవిష్యత్తులో ఏ లక్ష్యం వైపు వెళ్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు మనం చూస్తున్న న్యాచురల్ స్టార్ ఎంసిఏలో పక్కింటి అబ్బాయి, నిన్ను కోరిలో భగ్న ప్రేమికుడు, మజ్నులో లవర్, పిల్ల జమీందార్ లో కాలేజీ స్టూడెంట్ కాదు. ఎలివేషన్ల ట్రెండ్లో తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటున్న న్యూ స్టార్. దసరాతో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల నానిలో ఈ మార్పుకు శ్రీకారం చుట్టాడు. దాని ఘనవిజయం నానికి కొత్త ఊపు తెచ్చింది. హిట్ 1, హిట్ 2 తానే నిర్మించినా అందులో వేరే హీరోలు నటించారు. కానీ మాస్ మేకోవర్ కోసం అలాంటి రిస్కులు తాను చేయాలని గుర్తించి హిట్ 3లో కత్తి పట్టుకున్నాడు. వర్కౌట్ అయ్యింది. అంతకు ముందు సెన్సిబుల్ సినిమాలు తీసే వివేక్ ఆత్రేయ ఒక వయొలెంట్ లైన్ చెబితే దానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి సరిపోదా శనివారంతో మరో హిట్టు ఖాతాలో వేసుకున్నాడు. ప్యారడైజ్ పాత్ర చాలా రిస్కుతో కూడుకున్నదే అయినా ఇప్పటిదాకా టాలీవుడ్ లో ఎవరూ చేయని రెండు జడల క్యారెక్టర్ కు ఓకే చెప్పాడు. క్రమంగా తన మాస్ బేస్ పెద్ద ఎత్తున బలపర్చుకునే ప్లానింగ్ లో ఉన్న నాని ఇకపై నో స్మూత్, ఎమోషనల్ మూవీస్ అంటున్నాడు. సుజిత్ తో చేస్తున్న బ్లడీ రోమియో కూడా ఫుల్ మసాలా ఉండే గ్యాంగ్ స్టర్ డ్రామా.



యానిమేషన్ టీజర్ తోనే క్లారిటీ వచ్చేసింది. నెక్స్ట్ లైనప్ లో ఎవరు ఉన్నా నానికి చెప్పాల్సింది లార్జర్ దాన్ లైఫ్ సబ్జెక్టులే. కాకపోతే ఏడాదికి మూడు లేదా కనీసం రెండు సినిమాలు రిలీజ్ ఉండేలా చూసుకునే నాని ఇప్పుడు ఒకటే ఇవ్వగలిగే రేంజుకు పెరగడం అభిమానుల్లో సంతోషం, బాధ రెండూ కలిగిస్తోంది. ప్యాన్ ఇండియా స్థాయిలో మార్కెట్ సుస్థిరం చేసుకోవాలనుకున్నప్పుడు స్పీడ్ గా వెళ్ళకూడదు.



# బిజినెస్ న్యూస్



## మరోసారి ట్రంప్ టార్గెట్‌లో భారత్.
## . ఆ దిగుమతులపై 126 శాతం డ్యూటీ..!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌ను టార్గెట్ చేశారు. మన దగ్గరి నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే సోలార్ ఉత్పత్తులపై ప్రాథమికంగా 126 శాతం డ్యూటీ విధించారు. ఇండోనేసియాపై ప్రాథమిక సుంకాలను 86 శాతం నుంచి 143 శాతానికి పెంచారు. లావోస్‌పై 81 శాతం డ్యూటీ వేశారు. ఫారెన్ సబ్సిడీల ఆధారంగా రేటును నిర్ధరించినట్లు అమెరికా వాణిజ్య శాఖ వెల్లడించింది. ఈ మూడు దేశాల నుంచి అగ్రరాజ్యానికి దిగుమతి అవుతోన్న సెల్స్, ప్యానెల్స్ వంటి సోలార్ దిగుమతుల విలువ 4.5 బిలియన్ డాలర్లని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తమ సోలార్ ఉత్పత్తులపై ఈ దేశ ప్రభుత్వాలు అసంబద్ధ రీతిలో సబ్సిడీలు ఇస్తున్నాయని ట్రంప్ ప్రభుత్వం వాదిస్తోంది. అమెరికా ఫస్ట్ విధానానికి ట్రంప్ తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. స్థానిక తయారీని ప్రోత్సహించడానికి తాపత్రయపడుతున్నారు. ఈ అధిక డ్యూటీ కారణంగా అమెరికా వినియోగదారులు సోలార్ దిగుమతులపై ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. ఇదిలాఉంటే.. ప్రపంచ దేశాలపై ఇప్పటికే ట్రంప్ ఎడాపెడా విధించిన సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో ఈ డ్యూటీ విధింపు ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసం.. మాస్టర్‌మైండ్ అతడే..

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590కోట్ల మోసం ఘటన బ్యాంకింగ్ రంగంలో సంచలనం సృష్టించింది. ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఈ కుంభకోణం సూత్రధారి బ్యాంకు మాజీ ఉద్యోగేనని తేలింది. బ్యాంకింగ్ ప్రక్రియను తారుమారు చేసి ప్రభుత్వానికి చెందిన ఈ నిధులను అతడు షెల్ కంపెనీలకు మళ్లించినట్లు వెల్లడైంది. దీంతో ఆ మాస్టర్‌మైండ్ సహా అతడికి సహకరించిన మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. హరియాణా లో చండీగఢ్‌లోని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ శాఖలో జరిగిన మోసం కేసులో నలుగురు నిందితులను పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. నిందితులను రిభవ్ రిషి, అభయ్ కుమార్, అభిషేక్ సింగ్లా, స్వాతి సింగ్లాగా గుర్తించారు. వీరిలో ఇద్దరు గతంలో ఐడీఎఫ్‌సీ బ్యాంకులో పనిచేసిన ఉద్యోగులు కాగా.. మరో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులని పోలీసులు తెలిపారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో మాజీ మేనేజర్ అయిన రిభవ్ రిషి ఈ మోసానికి మాస్టర్‌మైండ్ అని, అతడే ఈ కుట్ర మొత్తాన్ని అమలుచేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రిషి చండీగఢ్‌లోని ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో నిందితులను విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.మోసం జరిగిందిలా.. హరియాణా ముఖ్యమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన-2.0 స్కీమ్‌కు సంబంధించిన నిధులను జమ చేసేందుకు ఆ విభాగం అధికారులు 2025 సెప్టెంబరు 26న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో రెండు ఖాతాలు తెరిచారు. తొలుత ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.50కోట్లు, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో రూ.25 కోట్లు జమ చేశారు. అయితే, ఆ నిధులను వినియోగించేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో ఈ ఖాతాలను మూసివేయాలని ప్రభుత్వ అధికారులు నిర్ణయించుకున్నారు. ఆ ఖాతాల్లో ఉన్న డబ్బు మొత్తాన్ని వడ్డీతో సహా మరో ఖాతాకు బదిలీ చేయాలంటూ ఈ రెండు బ్యాంకులకు ఈ ఏడాది జనవరి 13న లేఖలు పంపారు. దీంతో జనవరి 16న ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ రూ.25.45 కోట్లను హరియాణా ప్రభుత్వానికి చెందిన మరో అకౌంట్‌కు బదిలీ చేసి తమ ఖాతాను మూసేసింది. అయితే, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మాత్రం కేవలం రూ.1.27 కోట్లను మాత్రమే ట్రాన్స్‌ఫర్ చేసింది. దీంతో ఖాతాలో ఉన్న రూ.50 కోట్ల నిధులు ఏమయ్యాయని హరియాణా ప్రభుత్వ విభాగం బ్యాంకును ప్రశ్నించింది. దీనికి బ్యాంకు నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో విచారణ కమిటీ వేసింది. ఈ విచారణలో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. ప్రభుత్వ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ఆ ఖాతా నుంచి నిధులను




షెల్ కంపెనీలకు చెందిన మరో బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు తేలింది. ఈ కుట్రంతా రిభవ్ రిషినే చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా బ్యాంకులో నిర్వహణపరమైన లోపాలు కూడా బయటపడ్డాయి. తప్పుల తడకగా కొన్ని లావాదేవీలను నిర్వహించినట్లు తెలిసింది. దీంతో గుట్టు లాగగా.. ప్రభుత్వ ఖాతాల్లోని మొత్తం రూ.590 కోట్ల నిధులను దారి మళ్లించినట్లు తేలింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన అధికారులు.. ఇప్పటికే ఆ సొమ్ము మొత్తాన్ని రికవరీ చేసినట్లు హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ వెల్లడించారు. ఈ మోసం నేపథ్యంలో ప్రభుత్వ ఖాతాలను నిర్వహించకుండా ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌పై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు.

## చంద్రశేఖరన్ పునర్నియామకంపై నిర్ణయం వాయిదా

టాటా గ్రూప్ ప్రధాన సంస్థ టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్.చంద్రశేఖరన్‌ను మూడోసారి పునర్నియమించడంపై నిర్ణయాన్ని బోర్డు వాయిదా వేసినట్లుగా తెలుస్తోంది. మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో ‘కొత్త వ్యాపారాల్లో నష్టాలపై భేదాభిప్రాయాలు తలెత్తడమే’ ఇందుకు కారణమని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అలాగే చంద్రశేఖరన్ పునర్నియామకానికి టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా కొన్ని షరతులు పెట్టినట్లు అవి వెల్లడించాయి. టాటా గ్రూపులో కొన్ని కంపెనీలకు నష్టాలు వస్తున్న అంశాన్ని కూడా సమావేశంలో నోయల్ లేవనెత్తారు. అయితే ఏ కొత్త వ్యాపారమైనా, పెట్టుబడులపై ప్రతిఫలాలు రావాలంటే కొంత కాలం వేచిచూడాల్సి ఉంటుందని చంద్రశేఖరన్ పునర్నియామకానికి మద్దతిస్తున్న బోర్డు సభ్యులు పేర్కొన్నట్లు సమాచారం. పునర్నియామక కమిటీకి సారథ్యం వహిస్తున్న అనితా జార్జ్ కూడా చంద్రశేఖరన్ పునర్నియామకానికి అనుకూలంగా మాట్లాడుతూ.. కొత్త ప్రాజెక్టుల్లో నష్టాలు ఊహించినవేనని తెలిపారు. ఒకటి రెండు కంపెనీలు నష్టాల్లో



ఉన్నంత మాత్రాన, గ్రూపు మొత్తం పనితీరుకు దానిని సంకేతంగా చూడలేమని కొందరు బోర్డు సభ్యులు వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఇన్నేళ్లుగా సంస్థ పురోగతిలో ఛైర్మన్ అందించిన సహకారాన్ని తక్కువ చేసి చూడకూడదని వాళ్లు పేర్కొన్నట్లు సమాచారం. కాగా.. చంద్రశేఖరన్ పునర్నియామకం అంశంపై ఓటింగ్ నిర్వహించాలని బోర్డు సభ్యులు ప్రతిపాదించినా, ‘దీనికంటే, ఆ నిర్ణయాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని’ చంద్రశేఖరన్ అన్నట్లు తెలుస్తోంది. నిర్ణయాలు తీసుకోవడంలో టాటా సన్స్, టాటా ట్రస్ట్స్ ఐక్యంగా ఉంటేనే.. టాటా గ్రూపు సమర్థంగా పనిచేయగలదని ఆయన చెప్పినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ ప్రస్తుత పదవీకాలం ముగియడానికి ఇంకా ఏడాది సమయం (2027 ఫిబ్రవరి) ఉంది. 2017 నుంచి ఈ బాధ్యతల్లో ఆయన కొనసాగుతున్నారు. చంద్రశేఖరన్ హయాంలో టాటా గ్రూపునకు చెందిన 15 అతిపెద్ద నమోదిత కంపెనీల ఆదాయాలు, లాభాలు దాదాపు రెట్టింపయ్యాయి.

# ప్రణాళిక ప్రకారం రోడ్డు భద్రతా చర్యలు అమలు చేయాలి

**అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి -- 25: నేటి మన దేశమ్ ప్రతినిధి** ప్రణాళిక ప్రకారం రోడ్డు భద్రతా చర్యలు అమలు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్, పీ ఆర్, పోలీస్, ట్రాన్స్ పోర్ట్, వైద్య, ఎక్సైజ్, విద్య, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో రోడ్డు సేఫ్టీ కమిటీ సమీక్ష సమావేశం అదనపు కలెక్టర్ నిర్వహించారు. ముందుగా గతనెలలో నిర్వహించిన రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం సందర్భంగా చర్చించిన అంశాలపై సమీక్ష చేశారు. రవాణా, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్, పోలీస్ శాఖ సంయుక్తంగా చేసిన సర్వే వివరాలపై ఆరా తీశారు. వివిధ ప్రధాన రహదారుల్లో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద రంబుల్ స్ట్రిప్స్, సోలార్ సిగ్నల్స్, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని, రోడ్డు పైకి అడ్డుగా వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలని సూచించారు. పలు జంక్షన్లు, రహదారుల్లో స్పీడ్ గన్స్, సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న వాటిని మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంక్ లలో కచ్చితంగా నో హెల్మెట్ .. నో పెట్రోల్ అమలు చేయాలని సూచించారు. పరిమితికి మించి విద్యార్థులను, ప్రయాణీకులను తరలిస్తున్న ఆటోలు, బస్సులను తనిఖీ చేయాలని, ఓవర్ లోడ్ తో వెళ్ళే సరుకు వాహనాలపై దృష్టి సారించాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్టీఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, ఈఈ ఆర్ అండ్ బీ నరసింహాచారి, ఈఈ నేషనల్ హై వేస్ సురేష్ రాథోడ్, డీటీఓ లక్ష్మణ్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, నేషనల్ హైవే డీఈ అన్నయ్య, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య, భీమా పథకాలు ఆగకుండా చూడండి.

**తెలంగాణ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్.**



**జగిత్యాల ఫిబ్రవరి 25(నేటి మన దేశమ్ ప్రతినిధి):** ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య, భీమా పథకాలు అగకుండా చూడాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా శాఖ జిల్లా స్థాయి సమావేశాన్ని బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రం లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన నగదు రహిత ఆరోగ్య పథకం, భీమా పథకాలు ఆగకుండా ఇబ్బందులు పడకుండా సజావుగా నిర్వహించాలన్నారు. భీమా వయో పరిమితిని 70 ఏళ్ల కు పెంచాలని, పెండింగ్ లో ఉన్న నాలుగు డి ఏ లను, పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పీ ఆర్సీ ప్రకటించాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య పథకం పేరును ఉద్యోగులు, పెన్షనర్ల పేర్లు వచ్చే విధంగా ఇపిహెచ్ ఎస్ (ఉద్యోగుల, పెన్షనర్ల ఆరోగ్య పథకం )గా పేరు పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పి. సి. హన్మంత్ రెడ్డి, కోశాధికారి గౌరి శెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు పి. అశోక్ రావు, వి. ప్రకాష్ రావు, సంయుక్త కార్యదర్శులు విఠల్, సత్యనారాయణ, ఆర్గనై జింగ్ కార్యదర్శులు సయ్యద్ యూసుఫ్, ఎం. డి. ఎక్బాల్, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షులు కుందేళ్ల మురళి, ధర్మపురి అధ్యక్షులు కే.గంగాదర్, రాయికల్ అధ్యక్షులు వేణు గోపాల్ రావు, జగిత్యాల అధ్యక్షులు బి. రాజేశ్వర్, మల్యాల అధ్యక్షులు ఎం. డి. యాకూబ్, మహిళా కార్యదర్శులు కరుణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పేదల గృహస్వప్నం నెరవేర్చడమే కాంగ్రెస్ లక్ష్యం

**మాజీ ఎమ్మెల్యే మలిపేద్ది సుధీర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్**



**శామీర్ పేట, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్):** ఆర్థికంగా బలహీన వర్గాలకు స్థిరమైన గృహవసతి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో భద్రత, స్థిరత్వం తీసుకువస్తోందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ అన్నారు. బుధవారం అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని లాల్‌గాడి మలక్‌పేటలో 6వ వార్డుకు చెందిన లబ్ధిదారులు మ్యాకల మాధవి--మహేష్ నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో వారు మాట్లాడారు. సుమారు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన గృహాన్ని నేతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇళ్లు మంజూరు చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. నక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబాభివృద్ధికి కృషి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. గృహప్రవేశం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంతం శిరీష కృష్ణ రెడ్డి, ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జిడిపల్లి వేణుగోపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్ పాల్గొన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు తలారి మౌనిక బాబు, ముద్దం సుధాకర్ రెడ్డి, సామల జశ్వంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి భిక్షపతి, మాజీ సర్పంచ్ ఎల్లం మల్లేష్, మాజీ ఎంపీటీసీ సరసం అశోక్ రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తంటం రాము, అలియాబాద్ మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. కాంగ్రెస్ తరపున పోటీ చేసిన కౌన్సిలర్ అభ్యర్థులు చట్లపల్లి నర్సింగరావు, సతీష్, చిలుగురి జ్యోతి మల్లేష్, అర్జున్, భూమిరెడ్డి నవీన్ రెడ్డి, తంటం యాదగిరి, కోడూరి దినేశ్, బోయిని సాయి కుమార్, మహమ్మద్ ఇనాయత్, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పంచాయతీ అవార్డుల పోటీలో సీతంపేట గ్రామం ఎంపిక.


**- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25, (నేటి మనదేశమ్),** జాతీయ పంచాయతీ అవార్డులు 2023--24 లో భాగంగా పచ్చదనం--పరిశుభ్రత విభాగంలో సుజాతనగర్ మండలం సీతంపేట గ్రామం ఎంపిక కావడం జిల్లా అభినందనీయం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. గ్రామం లోని పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాల్లో సాధించిన పురోగతికి గుర్తింపుగా ఈ ఎంపిక జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టర్ సీతంపేట గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య చర్యలను సమగ్రంగా పరిశీలించారు. గ్రామంలో డ్రైనేజీలు, ఇంకుడు గుంతలు, ఇంటింటి మరుగుదొడ్లు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయ సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిలో నిర్మించిన మరుగుదొడ్లను తప్పనిసరిగా వినియోగించు కోవాలని, బహిరంగ విసర్జనకు చేయరాదు అని గ్రామస్థులకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించి గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని, చెత్త వర్గీకరణను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డ్రైనేజీలు ఎక్కడా మూసుకుపోకుండా తరచుగా శుభ్రపరచాలని, ఇంకుడు గుంతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో పురుషులు, మహిళలకు వేర్వేరు మరుగుదొడ్లు ఏర్పాటు చేసి పరిశుభ్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో పచ్చదనం విస్తరించేందుకు విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని కలెక్టర్ ఆదేశించారు. నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కలు పెంచి ప్రతి వీధిలో, ఖాళీ ప్రదేశాలలో, పాఠశాలలు మరియు అంగన్వాడీ కేంద్రాల పరిసరాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో సీతంపేట గ్రామం ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. గ్రామ లైబ్రరీలో 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన అధ్యయన సామగ్రిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీల వెంట ఉన్న గుంటలను సరిచేయడానికి అవసరమైన రోలర్‌ను అందజేస్తామని హామీ ఇచ్చారు. బయోచార్ తయారీ చేసి వచ్చిన బొగ్గుని డ్రైనేజీలలో చల్లడం ద్వారా డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉంటాయి అని ఆ విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. త్వరలో జాతీయ స్థాయి పరిశీలన బృందం గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో, పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పరిరక్షణ, మౌలిక సదుపాయాల సంరక్షణలో ఎటువంటి లోపాలు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ కృష్ణ ప్రసాద్, శిక్షణ డి పి ఓ అనూష, ఎంపీడీవో అనురాధ, ఎంపీఓ శ్రీనివాస్, డిఎల్పిఓ ప్రభాకర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారం ఉందని ఎవ్వరిని ఇబ్బంది పెట్టవద్దు..

**ధర్మపురి ప్రజలకు నాయకులుగా కాదు.. సేవకులుగా పనిచేయాలి..**
**ధర్మపురి మున్సిపల్ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ..**
**హాజరై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**







**ధర్మపురి, ఫిబ్రవరి 25(నేటి మన దేశమ్ ప్రతినిధి):** ప్రజలు ఇచ్చిన అధికారంతో ఎవ్వరిని ఇబ్బందులకు గురి చేయవద్దని మున్సిపల్ పాలకవర్గంలో ఎన్నికైన వారు నాయకులుగా కాకుండా సేవకులుగా పనిచేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి మున్సిపల్ నూతన పాలక వర్గానికి సూచించారు. ధర్మపురి మున్సిపల్ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమం బుధవారం ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు 15 వార్డులకు గాను 15 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించిన ధర్మపురి ప్రజల రుణం తీర్చుకుంటానని మంత్రి అన్నారు. 2009 నుంచి తనకు దినేష్ అండగా నిలిచారని మంత్రి అన్నారు. నియోజకవర్గంలో మంచి చెడులకు తానే బాధ్యత వహిస్తానని మంత్రి తెలిపారు. తప్పకుండా అందరికి న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కౌన్సిల్ సభ్యులు సూచించిన సమస్యలతో పాటు ప్రజల సమస్యలు పరిష్కారం చూపించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ పరంగా నిధులు విడుదల చేయడానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ధర్మపురి పట్టణంలో ని ప్రతి ఇంటికి తాగు నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. పుష్కరాలకు వస్తున్న నేపథ్యంలో ధర్మపురి కి నిధులు విడుదల చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకరించినట్లు మంత్రి తెలిపారు. కనివిని ఎరుగని రీతిలో ధర్మపురిని అభివృద్ధి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలోనే ధర్మపురి లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటానని మంత్రి తెలిపారు. ఈనెల 27న పుష్కరాల ఏర్పాట్లపై ధర్మపురికి ప్రభుత్వం తరఫున కన్సల్టెన్సీ ప్రతినిధులు వస్తున్నారని మంత్రి తెలిపారు. పార్టీలకు అతీతంగా ముందుకు వచ్చి పుష్కరాల ఏర్పాట్లకు సలహాలు సూచనలు ఇవ్వాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ కోరారు. ఆనంతరంమున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు 15మందికి 15మందిని గెలిపించానికి కృషి చేసిన మంత్రి లక్ష్మణ్ కుమార్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన బాధ్యత సక్రమంగా నిర్వహిస్తామని అన్నారు. ఆనంతరంమున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న మాట్లాడుతూ మంత్రి లక్ష్మణ్ కుమార్ చొరవతో పుష్కరాలను విజయవంతం చేస్తామని అన్నారు. ఆనంతరంజగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ మాట్లాడుతూ నూతన పాలకవర్గం అభివృద్ధి, సంక్షేమం రెండింటిని ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలని కోరారు. పారిశుద్ధ్యం, తాగు నీటి సమస్య పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి సెంటర్ తనిఖీ చేసిన కార్పొరేటర్ స్వప్న..

**గ్రామ ఆరోగ్య పరిశుభ్రత పోషణ దినోత్సవం పాల్గొన్న కార్పొరేటర్ స్వప్న..**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25, (నేటి మనదేశమ్),** కొత్తగూడెం అర్బన్ రామవరం 19 డివిజన్ లో విలేజ్ హెల్త్ శానిటేషన్ న్యూట్రిషన్ డే సందర్భంగా చిట్టీ రామవరం 2 అంగన్వాడి సెంటర్ లో ఫస్ట్ డోస్ హ్యూమనైజేషన్ జరిగింది. రెండు అంగన్వాడీ సెంటర్స్ ని పార్వతి సూపెర్వైషర్ విజిట్ చైయటం జరిగింది. ఈ సందర్భంగా 19 డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ కేతావత్ స్వప్న ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గర్భిణి బాలింతలు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారి తల్లులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం కొత్తగూడెం మొట్టమొదటి కార్పొరేషన్ లో 19 డివిజన్ మొట్టమొదటి కార్పొరేట్ స్వప్న కి సూపర్వైజర్ అంగన్వాడి టీచర్స్ ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ శ్రీదేవి, రాధికా తులసి, రజిత, రమాదేవి, బస్తీ దవాఖాన గవర్నమెంట్ అజయ్ డాక్టర్, గవర్నమెంట్ స్కూల్ హెచ్ఎం ప్రిస్కిల్లా మేడం, కిషన్ సార్, హెల్త్ డిపార్ట్మెంట్ 14 నెంబర్ రామవరం హాస్పిటల్స్ సి ఓ. శ్రీనివాస్ కవిత నర్స్, ఆశ భవాని, గ్రామ పెద్దలు గోబ్రియ నాయక్, మూడు రమేష్, బోడ కృష్ణ, రాజకుమార్,, హరి, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పి



**అదిలాబాద్ ఫిబ్రవరి 25 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను అత్యంత పకడ్బందీగా, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో, జిల్లా కేంద్రంలోని తెలంగాణ బాలికల సాంఘిక సంక్షేమ నివాస జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు పరీక్షకు మొత్తం 9,396 మంది విద్యార్థులకు గాను, 8,839 మంది హాజరయ్యారని, 557 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన కనీస వసతులు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద నిబంధనల అమలులో ఎటువంటి రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించాలన్నారు. సమయపాలన విషయంలో విద్యార్థులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు కొనసాగించాలని ఎస్పీకి సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమలో ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, శిక్షణ ఐపీఎస్ రాహుల్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గణేష్ జాదవ్, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇతర విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహణలో ఐటీడీఏ పీవో నిర్లక్ష్యం

**సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ ఆగ్రహం**



**భద్రాచలం, ఫిబ్రవరి 25:(నేటిమన దేశమ్ ప్రతినిధి )** గిరిజనుల ఆరాధ్య దైవం, సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని భద్రాచలంలో అధికారికంగా నిర్వహించడంలో ఐటీడీఏ పీవో రాహుల్ తీవ్ర నిర్లక్ష్యం వహించారని సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ మండిపడ్డారు. గిరిజన సంక్షేమానికి బాధ్యత వహించాల్సిన ఉన్నతాధికారి, సేవాలాల్ జయంతిని విస్మరించడం గిరిజన సమాజాన్ని అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సేవాలాల్ మహారాజ్ 287వ జయంతిని తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడమే కాకుండా, ఇందుకోసం రూ. 2.50 కోట్ల నిధులను కూడా కేటాయించారని గుర్తు చేశారు. వేడుకల నిర్వహణకు స్థానిక ఎమ్మెల్యే చైర్మన్‌గా, కలెక్టర్ కన్వీనర్‌గా, తహసీల్దార్లు, ఏటిడిఓ లు సభ్యులుగా కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలోని అనేక మండలాల్లో అధికారులు ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంటే, భద్రాచలం ఐటీడీఏ పరిధిలో పీవో ఆధ్వర్యంలో ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి గిరిజన సంస్కృతిని, ఆచారాలను గౌరవించని పీవో వైఖరిని సేవాలాల్ సేన జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని ఆయన పేర్కొన్నారు. తక్షణమే ఈ నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా కొత్తగూడెం జిల్లా కేంద్రం యందు జిల్లా కలెక్టర్ గారు అధికారికంగా నిర్వహించాలి కానీ ఇప్పటివరకు సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమం ఆయా జిల్లా అధికారులె నిర్లక్ష్యం వహిస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు

# ఈదురుగాలులతో కూడిన వాన

- నేలకు ఒరిగిన భారీ వృక్షాలు
- కొత్తవలస సబ్బవరం మండలాలకు స్తంభించిన రాకపోకలు



**కొత్తవలస, ఫిబ్రవరి 25 నేటిమనదేశమ్ ప్రతినిధి :** శృంగవరపు కోట నియోజకవర్గం కొత్తవలస మండలంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కురిసిన భారీ వానకు కొన్ని ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకు వరగగా కొత్తవలస మండల కేంద్రంలో జోరు వాన కురిసింది ఉదయము నుంచి అధిక ఉష్ణోగ్రత ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కొరవడంతో కొంతమేర ప్రజలకు ఉపశమనం



కలుగగా కొత్తవలస నుండి సబ్బవరం వెళ్లే ప్రధాన రహదారిలో దెందేరు గ్రామం వద్ద భారీ వృక్షాలు నేలకు వరగడంతో సుమారు రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి గ్రామానికి చెందిన యువకులు వెంటనే స్పందించిన స్థానికులు జెసిబి లో కత్తుల సహాయంతో ఒరిగిన చెట్లను హఠాఒట్టిన తొలగించి అటుగా ప్రయాణించే ప్రయాణికులకు రాకపోకలు సుగమం చేశారు.



**కొయ్యూరు, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్) :** కొయ్యూరు.. అల్లూరు జిల్లా అధ్యక్షులు, పాడేరు నియోజకవర్గం ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు, పర ్యటన,అనివార్య కారణాలవల్ల , షెడ్యూల్లో మార్పు చేసినట్లు, కొయ్యూరు మండల అధ్యక్షుడు బిడిజాన అప్పారావు తెలిపారు. ఈనెల 28న ,యు చీడిపాలెం పంచాయతీ, ఎర్రగొండపాలెం లో పర్యటిస్తారని, మార్చి 1, తేదీన,మటం భీమవరం గ్రామంలో, సచివాలయాన్ని ప్రారంభిస్తారని, తెలిపారు..కావున ఈ కార్యక్రమానికి ఎంపీపీ , వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు, సర్పంచ్ లు,వివిధ అనుబంధ విభాగాల రాష్ట్ర, జిల్లా,మండల నాయకులు, గతంలో నామినేటెడ్ పదవులు స్వీకరించిన వారు,మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి లీగల్ క్లబ్స్


## ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ



**మంగళగిరి, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్) :** కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో లీగల్ క్లబ్స్ నిర్వహించి విద్యార్థినుల సమస్యలను నమోదు చేసుకుని, కమ్యూనిటీ మహిళా రక్షణకు విద్యార్థులు వలంటీర్లుగా పనిచేసే విధానాన్ని తీసుకువస్తామని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ స్పష్టం చేశారు. క్యాంపస్ అంబాసిడర్ల కార్యక్రమ నిర్వహణపై రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో మంగళవారం మహిళా కమిషన్ అడ్వయిజరీ డైరెక్టర్ సూయజ్, ఉన్నత విద్య మండలి చైర్మన్ మధుమూర్తితో కలిసి ఆమె వర్చువల్ సమావేశం నిర్వహించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూలంకషంగా చర్చించారు. శైలజ మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థులు మహిళా కమిషన్ ఆధ్వర్యంలో పరిశోధనలు జరపాలని సూచించారు. పరిశోధనలు చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేస్తామని, ఈ సర్టిఫికెట్లు ఉద్యోగ నియామకాలు, కళాశాలల్లో సీట్లు సంపాదించడానికి రిజర్వేషన్లుగా పనిచేస్తాయని తెలిపారు.

# శ్రీమఠానికి నవరత్న కవచం

## 50 కిలోల రజత శేష వాహనాన్ని బహూకరణ





**మంత్రాలయం, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్) :** కర్నూలు జిల్లా మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ఓ భక్తుడు 50 కిలోల వెండి శేష వాహనం, సుమారు రూ.కోటిన్నర నవరత్న కవచాన్ని బహూకరించినట్టు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, మఠం అధికారులు తెలిపారు. బెంగళూరుకు చెందిన సంపత్ కుమార్ శెట్టి అనే భక్తుడు.. మూలరాములుకు రజత శేష వాహనం, పూర్వ పీఠాధిపతి సుజయీంద్రతీర్థుల బృందావనానికి నవరత్న కవచాన్ని బహూకరించినట్టు వెల్లడించారు. నవరత్న కవచాన్ని సుజయీంద్ర తీర్థుల బృందావనానికి అలంకరించి పీఠాధిపతి హారతులు ఇచ్చారు. రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి భక్తుడి కుటుంబాన్ని ఆశీర్వదించారు.

# జగన్ కోసం 'ఆత్మాహుతి దళం' అవుతాం

## ధర్మాన కృష్ణదాసు



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్) :** టీడీపీ దాడులను తిప్పి కొట్టేందుకు మా నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కోసం ఆత్మాహుతి దళంలా పని చేస్తామని వైసీపీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాసు అన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ రోడ్డులో టీడీపీ వర్గాల దాడిలో దెబ్బతిన్న మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిని ఆయన మంగళవారం పరిశీలించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం అని చెప్పి ఇలాంటి దాడులను ప్రోత్సహించడం దారుణమమన్నారు.

# ఓపెన్ స్కూల్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

## కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



**పార్వతీపురం, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్) :** జిల్లాలో మార్చి రెండు నుంచి 13వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి, ఇంటర్ ఓపెన్ స్కూల్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏపీ ఓపెన్ స్కూల్‌పరీక్షలకు సంబంధించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతికి ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇంటర్ విద్యార్థులకు రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలి పారు. పరీక్షలను మూడుఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షి స్తాయన్నా రు. పదో తరగతి పరీక్షలకు 23 మంది ఇన్విజిలేటర్లను, ఇంటర్ విద్యార్థుల కోసం 15 మంది ఇన్విజి లేటర్లను కేటాయించామన్నారు. పది పరీక్షలకు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు కలిపి 568 మంది, ఇంటర్ రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 356 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. పరీ క్షకేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సమావేశంలో డీఆర్వో హేమలత, జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు పాల్గొన్నారు.

# ప్రేమ విఫలమై యూట్యూబర్ కోమలి ఆత్మహత్య



**రాయదుర్గం (హైదరాబాద్) : (నేటి మనదేశమ్) :** ప్రేమ విఫలమై యూట్యూబర్ కోమలి (21) ఆత్మహత్యకు పాల్పడింది. బుధవారం రాయ దుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల మేరకు ... విశాఖపట్టణానికి చెందిన కోమలి.. హైదరాబాద్‌లో బీఎస్సీ చదువుతోంది. మణి కొండలోని చిత్రపురి కాలనీ ఎల్ఐజీలో బంధువుల వద్ద ఉంటోంది. విశాఖపట్నానికే చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, యూట్యూబర్ నిఖిల్ రెడ్డిని ఆమె ప్రేమిస్తోంది. కోమలి నుంచి దూరంగా ఉండేందుకు నిఖిల్ ప్రయత్నిస్తుండటంతో ఆరు నెలల క్రితం ఆమె ఆత్మహత్యకు యత్నించగా.. బంధువులు సర్ది చెప్పారు. ఇటీవల పెళ్లి విషయంలో కోమలి, నిఖిల్‌రెడ్డి గొడవ పడ్డారు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో కోమలి ఉరివేసుకుంది. ఆమె తల్లి మంగళవారం రాయదుర్గం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పీఏసీఎస్ ఉద్యోగుల ఆందోళన విరమణ

- డిమాండ్లపై సర్కారు సానుకూల నిర్ణయం
- జీతాలు 20 శాతం, గ్రాట్యుటీ 4 లక్షలకు పెంపు



**అమరావతి, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్) :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) ఉద్యోగులు ఆందోళన విరమించారు. కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న పీఏసీఎస్ ఉద్యోగుల డిమాండ్లపై స్పందించిన ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపింది. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, సహకారశాఖల మంత్రి అచ్చెన్నాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సహకారశాఖ కమిషనర్ అహ్మద్‌బాబు, ఆప్కాబ్ ఎండీ రామకృష్ణ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. పీఏసీఎస్ ఉద్యోగుల జీతాల 20శాతం పెంపును ఆమోదిస్తూ ఈ సందర్భంగా మంత్రి, అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గ్రాట్యుటీని రూ.2లక్షల నుంచి రూ.4లక్షలకు పెంచాలని, ప్రతి ఉద్యోగికీ రూ.5లక్షల గ్రూప్ ఆరోగ్య బీమా అమలు చేయాలని నిర్ణయించారు. ఉద్యోగుల విస్తృత ప్రయోజనాలపై త్వరలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి అచ్చెన్న ప్రకటించారు. అనంతరం ఉద్యోగ సంఘాల నేతలు విజయవాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

# డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అప్రమత్తం



**పెందుర్తి, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్) :** డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువతను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని పెందుర్తి సిఐ సతీష్‌కుమార్ తెలిపారు. డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా డివైఎఫ్ఐ చేపట్టిన జనచైతన్య బైక్ యాత్ర మంగళవారం కాకానినగర్, వినోద్‌నగర్, చాకలివీధి, ప్రియదర్శిని కాలనీ, గోపాలపట్నం, వేపగుంట మీదుగా పెందుర్తి వరకు సాగింది. పెందుర్తిలో పాత పెందుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కాలేజీ, పాలిటెక్నికల్ కాలేజీ, రైతు బజారు, కార్మిక నగర్, చైతన్య నగర్, అప్పన్నపాలెంలో ర్యాలీ నిర్వహించారు. పెందుర్తి రైతు బజార్ సెంటర్ వద్ద సిఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల బారినపడిన యువత, విద్యార్థుల జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. బిడ్డలపై కోటి ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు ఆవేదన మిగులు తుందని పేర్కొన్నారు. ప్రశాంతమైన, ఆహ్లాదకరంగా వుండే ప్రాంతాలు అశాంతికి నిలయాలుగా మారుతున్నా యన్నారు. డ్రగ్స్, గంజాయి వ్యాపార మాఫియా తమ అక్రమార్జన కోసం యువత, విద్యార్థుల జీవితాలను బలితీసు కుంటున్నాయని విమర్శించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, కె.మహేష్ మాట్లాడుతూ యువత, విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను కాపాడా లని, తల్లి దండ్రుల ఆశలు నెరవేరాలని, ప్రశాంత, ఆహ్లాదకర ప్రాంతాల్లో, విద్యాసంస్థల్లో మత ్తుమందులను తరిమికొట్టాలనే ఉద్దేశంతో 'డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు వద్దు. ఆరోగ్యం, జీవితం ముద్దు" అనే లక్ష్యంతో డివైఎఫ్ఐ ఈ 'జన చైతన్య బైక్ యాత్ర' చేపట్టినట్లు తెలిపారు. మత్తు పదార్థాలను వ్యతిరేకించే ప్రతి సంఘమూ, సంస్థా, సమాజాభివృద్ధిని ఆశించేవారంతా ఈ యాత్రను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్, ప్రభుదేవా, ఈశ్వరరావు, నితిన్, రాము, శ్రీను, విశ్వమోహన్ తదితరులు పాల్గొన్నారు. గోపాలపట్నం : డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యాన చేపట్టిన యాత్ర కాకానినగర్, బాజీ జంక్షన్, గోపాలపట్నం మీదుగా సాగింది. కాకానినగర్ వద్ద డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యుఎస్ఎన్.రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో గంజాయి వినియోగం అధికమైందని, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మత్తు పదార్థాల వల్ల రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయని, బెల్ట్ షాపులు వద్ద అనేక అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిపారు. బెల్టు షాపులను తక్షణమే నియంత్రించాలని కోరారు. విద్యార్థులు పెడదారి పట్టకుండా చూసే బాధ్యత ప్రభుత్వానికి ఉందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

# జనాభా లెక్కల నమోదు పక్కాగా చేయాలి : జెసి




**గుంటూరు, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్) :** జనాభా లెక్కల నమోదు పక్కాగా చేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. జనాభా లెక్కల సేకరణ -- 2027 ఇళ్ల జాబితా తయారీ, కుటుంబ జనాభా గణన అంశంపై జిల్లా, మున్సిపల్ కార్పొరేషన్, మండల స్థాయి అధికారుల మూడ్రోజుల రోజుల శిక్షణ కార్యక్రమం ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ 2027లో నిర్వహించే జనాభా లెక్కల సేకరణ 16వది కాగా స్వాతంత్ర్యం వచ్చాక 8వది అని, ప్రపంచంలోనే పురాతనమైన జనాభా లెక్కల సేకరణ అని చెప్పారు. జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశ హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్(హెచ్ఎల్ఓ), రెండవ దశ పాపులేషన్ ఎన్యుమరేషన్ (పిఇ) జరుగుతుందని తెలిపారు. ఈసారి నిర్వహించే జనాభా లెక్కల సేకరణకు ఒక ప్రత్యేకత ఉందని మొట్టమొదటి సారిగా డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను చేపట్టినట్లు చెప్పారు. గుంటూరు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ డేటా సేకరణ కోసం నియమించే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు సమర్థవంతమైన శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. డేటా సేకరణపై జనాభా లెక్కల విజయవంతం ఆధారపడి ఉంటుందన్నారు. జనాభా లెక్కల కార్యనిర్వహణ అధికారి, జాయింట్ డైరెక్టర్ జి. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను డిజిటల్ విధానంలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి, అందుకు అనుగుణంగా మొబైల్ అప్లికేషన్, వెబ్ పోర్టల్‌ను రూపొందించినట్లు తెలిపారు. మొబైల్ యాప్‌లలో ఎన్యూమరేటర్ ద్వారా ఇంటింటికి వెళ్లి సొంత మొబైల్ ఫోన్‌లను ఉపయోగించి లేదా స్వంత పరికరాన్ని తీసుకువెళ్లి డేటా సేకరణ చేయడం జరుగుతుందన్నారు.

# 9 నుండి ఎయిర్‌ఫోర్స్ ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ




**గుంటూరు, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్) :** ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మహిళ, పురుష అభ్యర్థులకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ మార్చి 9వ తేదీ నుండి ప్రారం భం అవుతుందని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీపై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సమావేశం జరిగింది. హైదరాబాద్ ఎయిర్ ఫోర్స్ రిక్రూటింగ్ డైరెక్టర్ వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ మాట్లాడుతూ మార్చి 9, 10 తేదీలలో బాలికలకు, 12,13 తేదీలలో ఆంధ్ర ప్రదేశ్ పురుష అభ్యర్థులకు, మార్చి 15,16 తేదీలలో తెలంగాణ పురుష అభ్యర్థులకు ఓపెన్ ర్యాలీ జరుగుతుందన్నారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎంపిక కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. 2005 జూలై 2 నుండి 2009 జనవరి 2వ తేదీ మధ్య జన్మించిన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. కనీస ఎత్తు 152 సెంటీమీటర్లు, ఇంటర్మీడియట్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత లేదా 3 ఏళ్ల డిప్లొమా ఇంజినీరింగ్ లేదా 2 సంవత్సరాల ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణత కలిగిన విద్యార్హత ఉండాలన్నారు. మొత్తం మార్కుల్లో 50 శాతం, ఇంగ్లీషులో 50 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలన్నారు.

అభ్యర్థులు ఎలాంటి ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, నేరుగా ర్యాలీ హాజరు కావచ్చని తెలిపారు. ఒరిజినల్ లేదా డిజీలాకర్ ద్వారా ధవపరిచిన విద్యార్హత సర్టిఫికేట్లు, నివాస ధవీకరణ, ఎన్.సి.సి సర్టిఫికెట్ (ఒక వేళ ఉంటే), ఆధార్, ఈ-మెయిల్ ఐడి, మొబైల్ నంబర్, ఇటీవలి తీసుకున్న 10 కాపీలు పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫొటోలు, ప్రతి సర్టిఫికెట్ కు సంబంధించిన 6 జిరాక్స్ కాపీలు తీసుకురావాలని వివరించారు. 1.6 కిలో మీటర్ల పరుగు పోటీ, భౌతిక, శారీరక పరీక్షలు ఉంటాయని,ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రాత పరీక్ష ఉంటుందన్నారు. ఇంగ్లిష్, హిందీ భాషల్లో ప్రశ్నాపత్రం ఉంటుందన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి..

**- జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న**



**నిర్మల్ , ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మార్చి 14 నుండి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు 2026 ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న అన్నారు. బుధవారం స్థానిక సెయింట్ థామస్ హై స్కూల్ లో జరిగిన చీఫ్ సూపరింటెంట్, డిపార్ట్మెంటల్ అధికారుల ఓరియంటేషన్ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు.. విద్యార్థులతో పాటు సిఎస్, డిఓ లకు సెల్ ఫోన్ అనుమతి లేదని అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ఐడెంటి కార్డు ధరించాలని సూచించారు. అనధికార వ్యక్తులు ఎవరు పరీక్ష కేంద్ర ఆవరణలో ఉండకూడదని అన్నారు. పదో తరగతి పరీక్ష పత్రాలను పోలీస్ స్టేషన్లో భద్రపరిచినప్పుడు తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ నుండి పరీక్ష కేంద్రానికి ప్రశ్న పత్రాలు, పరీక్ష కేంద్రం నుండి పోస్ట్ ఆఫీస్ కు సమాధాన పత్రాలు తీసుకెళ్లేటప్పుడు కచ్చితంగా పోలీస్ ఎస్కార్ట్ తో వెళ్లాలని పేర్కొన్నారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాలలో తాగునీరు సౌకర్యం, టాయిలెట్ సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ప్రతి పరీక్ష గదిలో లైట్లు, ఫ్యాను ఉండేలా చూసుకోవాలని అన్నారు. విద్యార్థుల సౌకర్యం కొరకు ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఆ పరీక్ష కేంద్రం యొక్క పేరు, సెంటర్ నెంబర్ గల ఫ్లెక్సిని ప్రదర్శించాలని సూచించారు. వికలాంగులకు గ్రౌండ్ ఫ్లోర్ లోనే పరీక్ష గదిని కేటాయించాలని అన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఖచ్చితత్వంతో ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షలను నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. ఇన్విజిలేటర్లు ప్రశ్న పత్రాన్ని విద్యార్థులకు మీడియం వారిగా అందించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ప్రభుత్వ పరీక్ష సహాయ కమిషనర్ ముదారపు పరమేశ్వర్ పరీక్ష నిర్వహణ తీరు గురించి వివరించారు. ఈ శిక్షణ తరగతులకు జిల్లాలోని 47 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపర్డెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, అదనపు డిపార్ట్మెంట్ అధికారులు, సి సెంటర్ కస్టోడియన్ ల, నిర్మల్ జిల్లా విద్యాశాఖ సిబ్బంది తదితరులు హాజరైనారు.

## ప్రభుత్వం ఇచ్చిన ఆర్ గ్యారంటీలు అమలు చేయాలని... సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ...ఎంబి నర్సారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఫిబ్రవరి 25: బూర్గం పహాడ్( నేటి మన దేశమ్ ప్రతినిధి)**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా..సిపిఎం పార్టీ బూర్గంపహడ్ మండల కమిటీ సమావేశం పాపినేని సరోజన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నర్సారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రజలకి ఇచ్చిన హామీలను నిలబెట్టు కోలేదని అన్నారు కానీ ఆరు గ్యారెం టీలో ఇప్పటివరకు ఇంకా అమలు కాని మహిళలకు 2500 ఇస్తామని అది అమలు కాలేదు. అంతేకాకుండా 12000 భూమి లేని ఉపాధి కార్మికులకు ఇస్తామని అది అమలు కాలేదు ఆటో కార్మికులకు 15000 ఇస్తామని చెప్పారు తప్ప అమలు చేయలేదని అన్నారు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన వారికి ఇందిరమ్మ ఇల్లు స్థలం లేని వారికి కట్టిస్తామని హామీ ఇచ్చింది ప్రభుత్వం ఇంత మట్టికి నిలబెట్టుకో లేదని ఇందిరమ్మ ఇల్లు అందరికీ ఇస్తామని చెప్పారు మొదటి విడత వచ్చాయి కొంతమందికి మళ్లీ ఇంతమందికి ఎక్కడ కూడా ఇవ్వలేదు వెంటనే అందరికీ ఇంద్రమ్మ ఇల్లు కట్టించాలని అన్నారు అందరికీ ఇంకా అందలేదని ప్రభుత్వం ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తాను అని చెప్పిన ప్రభుత్వం ఇవాల ఖమ్మం లో 15 సంవత్సరాలు బట్టి ఉంటున్న నిరుపేద కుటుంబాలకు వారికి ఎటువంటి నోటీసు ముందస్తు ఇవ్వకుండా పోలీసు బలగాల తోటి దౌర్జనంగా నిరుపేద కుటుంబాలపై కాకిలు దౌర్జన్యాలు చేస్తున్న ప్రభుత్వం అలా చేయటం అనేది చాలా అన్యాయమని అన్నారు కార్పొరేట్ శక్తుల కి కట్టబెట్టడానికి మంత్రులు చూస్తున్నారని అది తీవ్రంగా సిపిఎం పార్టీ ఖండిస్తుం దని ఒకవేళ అక్కడ ఉన్న ప్రజల్ని తొలగించాలంటే ముందస్తు నోటీసులు ఇవ్వాలని వారికి హెచ్చరిక జారీ చేయాలని అదేవిధంగా అక్కడ ఉన్న 1250 కుటుంబాలకు ప్రభుత్వం ఇంటి స్థలం చూపించి ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఆ తర్వాత ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయమని ఆ ప్రజల్ని మంత్రులు అడగాల్సిన అవసరం ఉంది కానీ ఎటువంటి హెచ్చరికలు లేకుండా దౌర్జనంగా బలవంతంగా కుబేర్లకు కట్టబెట్టడానికి ప్రయత్నంతో ఆ ప్రజల్ని రోడ్డున పడేసిన మంత్రులు అని ఈ సందర్భంగా తెలిపారు ఇదే రకంగా ప్రజల పైన నిరుపేదల పైన ఈ ప్రభుత్వం దాడులు కొనసాగిస్తే ఖచ్చితంగా ప్రజలు ఎంతటి వారికైనా గుణపాఠం చెప్పే అవకాశాలు కచ్చితంగా ప్రజల చేతుల్లో నే ఉంది అని అన్నారు ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాండవుల రామనాథం, ఎస్కే ఆబీదా, తదితరులు పాల్గొన్నారు

## ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట (ఫ్రీబ్రావరి 25(నేటి మన దేశమ్ ప్రతినిధి)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వేద సరస్వతి జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈ పరీక్షలకు నిర్వహణ కు గాను అధికారులు జిల్లాలో మొత్తం 15 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. బుధవారం కలెక్టర్ పట్టణంలోని కూరగాయల మార్కెట్ రోడ్ మార్గంలోని వేద సరస్వతి జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి ఎంతమంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారని, ఎంతమంది గైర్హాజరు అయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపల్ నడిమింటి శేషమ్మ ను అడిగి తెలుసుకున్నారు. తొలి రోజు ఎవరైనా 9:05 నిముషాల తర్వాత కేంద్రానికి వచ్చారా అని ప్రశ్నించగా ఎవరూ రాలేదని అందరూ నిర్ణీత సమయంలోనే వచ్చారని ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించారా లేదా సీసీ కెమోరాలను ఏర్పాటు చేశారా ఎన్ని కెమోరాలను అమర్చారని అడిగి తెలుసుకున్నారు.తర్వాత కేంద్రంలోని గదులకు వెళ్ళి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పగడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు



## ప్రజా శాంతి, భద్రత, ప్రశాంతతకై నిషేధాజ్ఞలు అమలు

**- వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్**




**వేములవాడ, ఫిబ్రవరి 25: నేటి మన దేశమ్ ప్రతినిధి** రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో ప్రజా శాంతి, భద్రత, ప్రశాంతతను కాపాడుటకు పోలీస్ చట్టం, 1861 లోని రూల్ 30 ప్రకారం జారీ చేయబడిన నిషేధాజ్ఞలను వేములవాడ టౌన్ పోలీస్ పరిధిలో కఠినంగా అమలు చేయనున్నట్టు సీఐ వీర ప్రసాద్ తెలిపారు. సంబంధిత సబ్-డివిజనల్ పోలీస్ అధికారి లేదా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అనుమతి లేకుండా ఎటువంటి ప్రజా సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు.ఖడ్గాలు, కత్తులు, ఈటెలు, కర్రలు (జెండాలతో లేదా లేకుండా), తుపాకులు, పేలుడు పదార్థాలు, ఇతర ప్రమాదకర ఆయుధాలను తీసుకెళ్లడం, ప్రజా రహదారులు లేదా ప్రజా స్థలాల్లో గుంపులుగా చేరి శాంతిభద్రతలకు భంగం కలిగించడం లేదా ప్రజలకు అసౌకర్యం కలిగించడం, రాళ్లు లేదా విసిరే వస్తువులు సేకరించడం/తీసుకెళ్లడం, అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు, డీజేలు, మైకులు ఉపయోగించడం, పాటలు, ప్రసంగాలు ప్రసారం చేయడం, వాహనాల ద్వారా హారన్ వినియోగించి ప్రకటనలు చేయడం, అనుమతి లేకుండా సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించడం చేయరాదని సూచించారు.ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై పోలీస్ చట్టం, 1861 రూల్ 30 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోబడుననీ పేర్కొన్నారు.విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, విధుల్లో ఉన్న సైనిక సిబ్బంది, విధుల్లో ఉన్న హోం గార్డులు, నిజమైన అంత్యక్రియల ఊరేగింపులు, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి శాంతి భద్రతలను పరిరక్షించుకోవాలని అన్నారు.

## హలో ఆదివాసి ఛలో గుండాల

**ఆదివాసి మహిళా రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి**

**అశ్వాపురం తుడుందెబ్బ మండల అధ్యక్షులు తెల్లం శ్రీను**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఫిబ్రవరి 25: పినపాక నియోజకవర్గం ( నేటి మన దేశమ్ ప్రతినిధి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో ఆదివాసి భవన్ వేదికగా అశ్వాపురం మండల ఆదివాసి తుడుం దెబ్బ అధ్యక్షులు తెల్లం శ్రీను ఆధ్వర్యంలో ఆదివాసి మహిళా రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ప్రచార పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి తంగేళ్ల భద్రయ్య మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా గుండాలలో రాష్ట్ర స్థాయిలో సదస్సు నిర్వహించబడుతుందని మహిళలు బారిస్థాయిలో యువత పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు ప్రపంచవ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి ఆదివాసీ మహిళల కోసం అంతర్జాతీయ సదస్సు ఏర్పాటు చేయడం. భారత రాజ్యాంగంలో వివిధ రకాల నిబంధనల ద్వారా స్త్రీలకు కొన్ని హక్కులు ప్రసాదించబడ్డాయి మరో ప్రక్క భారత రాజ్యాంగం ఆడ మగా సమానత్వాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించింది ఏజెన్సీ ప్రాంతాల్లో వేల సంవత్సరాలుగా వస్తున్న పాతకాలపు ఆలోచనల వల్ల కొడుకులు కూతుళ్ళ మధ్య తేడాలు చూపిస్తున్నారు ఆడపిల్లలు పెళ్లి అయిన తర్వాత అత్తారింటికి వెళ్తారని కొడుకులైతే వంశం పేరు నిలబడతారని సంపాదించిన ఆస్తికి వారసులు అవుతారని వృద్ధాప్యంలో బాధ్యత సేపడతారని చచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తారు అన్న పాతకాలపు విశ్వాసం తల్లిదండ్రులలో నరనరా న జీవించుకున్నది ఆడపిల్లల విద్య బుద్ధులపై ఖర్చు పెడితే దండగని మహిళలను రెండవ తరగతి మనిషిగా చూస్తూ తల్లిదండ్రులు ఆడపిల్లలను ప్రాథమిక విద్య వరకు చదివించి చదువు మాన్పిస్తున్నారు మగవారితో సమానంగా పోడు కొట్టడం వరి నాట్లు వేయడం కలుపు తీయడం కోతలు కోయడం మిర్చి తోట పనులకు వెళ్లడం వివిధ రకాల వ్యవసాయ పనులు చేయించడం ఉపాధి హామీకి పనికి పంపడం అన్ని రకాల పనులను చేయిస్తున్నారు బాల్య దశలోనే పెళ్లి చేసే అత్తవారింటికి పంపించడం జరుగుతున్నది అని మాట్లాడారు. తుడుం దెబ్బ మండల అధ్యక్షులు తెల్లం శ్రీను మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసి సమాజంలో ఉన్న ఇన్ని సమస్యలను రుగ్మతలను తొలగించాలంటే ఆదివాసి మహిళలు సంఘటితమై చైతన్య శక్తిగా ఎదిగి ఆదివాసి సమాజాన్ని మార్చవలసిన అవసరం ఉన్నదని అశ్వాపురం ఆదివాసీ మహిళా శక్తులకి ఈ ప్రకటన ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండలంలోని ఆదివాసి పెద్దలు బోడిక వెంకటేశ్వర్లు, మాడే కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ బట్ట సత్యనారాయణ, ఆదివాసి జేఏసీ మండల అధ్యక్షులు కల్లూరి నరసింహారావు ఉపాధ్యక్షులు తో కలచంద్రశేఖర్ జేఏసీ సభ్యులు చింత వెంకటేశ్వర్లు చాప ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ మొదటి రోజు పరీక్ష ప్రశాంతం

***జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి***

***ఇంటర్ మొదటి సంవత్సరం ద్వితీయ భాష పేపర్ -1 పరీక్షకు 17 వేల 667 మంది హాజరు***

***విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి***

***గాంధీచౌక్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖ చేసిన జిల్లాకలెక్టర్***

**ఖమ్మం,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్):** జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.జిల్లా కలెక్టర్, గాంధీచౌక్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి, పరీక్ష జరుగుతున్న తీరు, పరీక్షా కేంద్రం నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తూ, విద్యార్థు లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని



అన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు చల్లని త్రాగునీరు సరఫరా చేయాలని, పరీక్ష కేంద్రానికి వచ్చే ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలని తెలిపారు. పరీక్షా గదుల్లో వెలుతురు, తాగునీరు, టాయిలెట్ నిర్వహణ సక్రమంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ ధైర్యం చెప్పారు. పరీక్ష సిబ్బంది తమ విధులను నిబద్ధతతో, భాధ్యతగా నిర్వహించాలని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం ద్వితీయ భాష పేపర్-1 పరీక్షకు జనరల్, ఒకేషనల్ కలిపి 18 వేల 258 మంది హాజరు కావాల్సి ఉండగా, పరీక్షకు 17 వేల 667 మంది హాజరు కాగా, 591 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, ఎక్కడా మాల్ ప్రాక్టీస్ నమోదు కాలేదని, మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ వెల్లడించారు.జిల్లా కలెక్టర్ పరీక్షా కేంద్రం తనిఖీ సమయంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు

## మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్

**ఫిబ్రవరి 28న వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్**




**హైదరాబాద్/వరంగల్ ఫిబ్రవరి 25(నేటి మనదేశమ్):** మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటించిన సంక్రాంతి బ్లాక్‌బస్టర్ మన శంకర వరప్రసాద్ వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ఫిబ్రవరి 28 (శుక్రవారం) సాయంత్రం 5:30 గంటలకు జీ తెలుగు ఛానెల్‌లో ప్రసారం కానుంది. అదే సమయంలో ఈ చిత్రం జుజు5 వేదికగా కూడా అందుబాటులో ఉంది.హిట్ మేకర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ హై-ఆక్షన్ కామెడీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ థియేటర్లలో భారీ వసూళ్లు సాధించి, ప్రేక్షకుల నుంచి విస్తృత ప్రశంసలు అందుకుంది. చిరంజీవి శంకర వరప్రసాద్ పాత్రలో మెప్పించగా, నయనతార, వెంకటేష్ దగ్గుబాటి, కెథరిన్ ట్రెసా, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రల్లో నటించారు.షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గరపాటి, సుష్మితా కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మించారు. భీమ్స్ సెసిరోలియో సంగీతం, సమీర్ రెడ్డి ఛాయాగ్రహణం, తమ్మిరాజు ఎడిటింగ్‌తో సినిమా మరింత ఆకట్టుకుంది. కుటుంబ భావాలు, వినోదం, యాక్షన్ సమపాళ్లలో మేళవించిన ఈ చిత్రం జీ5లో 500 మిలియన్ స్ట్రీమింగ్ నిమిషాలు సాధించి డిజిటల్ వేదికపై కూడా సెన్సేషన్ సృష్టించింది

## తొలి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25, (నేటి మనదేశమ్)**,జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల తొలి రోజు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించబడినట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ఎటువంటి అంతరాయం లేకుండా క్రమబద్ధంగా నిర్వహించబడినట్లు తెలిపారు . ఈ సందర్భంగా పాల్వంచ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాల, పాల్వంచలోని పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించి, పరీక్షల నిర్వహణ తీరును సమగ్రంగా పరిశీలించారు. ప్రశ్నాపత్రాల భద్రతా పంపిణీ విధానం, అభ్యర్థుల తనిఖీ ప్రక్రియ, ఇన్విజిలేషన్ వ్యవస్థ, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర అంశాలను సమీక్షించి, పరీక్షలు పారదర్శకంగా నిర్వహించ బడుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 37 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించబడినట్లు తెలిపారు. జనరల్, వొకేషనల్ విభాగాలు కలిపి మొత్తం 9,685 విద్యార్థులు ఉండగా , అందులో 9,210 మంది పరీక్షలకు హాజరయ్యారని వెల్లడించారు. జనరల్ విభాగంలో 7,973 మందికి విద్యార్థులు ఉండగా , 7,683 మంది హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 1,712 మంది ఉండగా, 1,527 మంది హాజరయ్యారు. మొత్తం 475 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.పరీక్షల సందర్భంగా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షా కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలు తదితర అన్ని మౌలిక వసతులు సమృద్ధిగా కల్పించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు . తదుపరి రోజుల్లో నిర్వహించనున్న పరీక్షలు కూడా ఇదే విధంగా పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ పరిశీలనలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకే కవాతు నిర్వహణ

**- దుబ్బాక సిఐ టి.రాజేష్**




**దుబ్బాక, ఫిబ్రవరి 25 నేటి మన దేశమ్** జిల్లా బౌగోళిక పరిస్థితులను అర్థం చేసుకోవడంతో పాటు ప్రజల శాంతి భద్రతల పరిరక్షణకే రాపిడ్ యాక్షన్ ఫోర్స్ తో ఫ్లాగ్ మార్చ్(కవాతు) నిర్వహించినట్లు దుబ్బాక సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.రాజేష్ తెలిపారు. బుధవారం దుబ్బాక పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి పట్టణంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత ఘర్షణలు, శాంతి భద్రతల సమస్యలు వస్తే వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితులను అదుపు చేయడంలో స్థానిక పోలీసులకు రాపిడ్ యాక్షన్ బలగాలు సహకరిస్తాయన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి గురించి ఏదైనా సమాచారం ఉంటే తక్షణమే పోలీసులకు తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ సరస్వతి, దుబ్బాక ఎస్సై కీర్తి రాజు, ఆర్ఎఎఫ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి



దేశాన్ని మరింత ధృడంగా నిర్మించడమే లక్ష్యం
సాదాసీదా స్థాయి నుంచి సుధృఢ అమెరికాను నిర్మించా
పౌరుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం
ఇరాన్ అణు కార్యక్రమాలతో అప్రమత్తంగా ఉన్నాం
తన పాలనా ప్రయాణం యుగాలకు మలుపు
స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ సుదీర్ఘ ప్రసంగం

వాషింగ్టన్ : అమెరికా గతంలో కన్నా దృఢంగా, మెరుగ్గా, సుసంపన్నంగా మారిందని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇది అమెరికాకు స్వర్ణయుగం అని ఆయన వెల్లడించారు. మంగళవారం స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇది చారిత్రాత్మక కాలంగా అభివర్ణించారు. తన పరిపాలన ప్రయాణం.. యుగాలకు మలుపుగా ఉంటుందని తెలిపారు. దేశ ఆర్థికాభి వృద్ధి పరుగులు పెడుతుందన్నారు. భవిష్యత్తులో దేశాన్ని మరింత మెరుగు పరుస్తామని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే జాతీయ పునరుజ్జీవం, ఆర్థిక వృద్ధితోపాటు ప్రపంచ ప్రభావంపై దృష్టి సారించినట్లు డొనాల్డ్ ట్రంప్ వివరించారు. ప్రపంచ స్థాయిలో అమెరికా మెరుగుపడిందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల వరకు అమెరికా సాదాసీదాగా ఉండేదని.. కానీ ప్రస్తుతం ప్రపంచంలోనే అగ్ర భాగాన నిలిచిందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం.. ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను పురుషుల హాకీ ఒలింపిక్స్ విజేత కానర్ హెల్లెబ్యూక్‌కు ప్రదానం చేయనున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత తొమ్మిది మాసాల్లో అమెరికాలోకి ప్రవేశించిన అక్రమ వలసదారులు శాతం సున్నాకు చే: రిందని పేర్కొన్నారు. 2028లో ఒలింపిక్స్‌కు అమెరికా వేదిక కానుందని ప్రకటించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వాన్ని నిర్మిస్తున్నామని ప్రజలకు భరోసా ఇచ్చారు. పౌరుల సంక్షేమానికే తమ తొలి ప్రాధాన్యమన్నారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్‌తో అమెరికన్లకు ఉపశమనం కలిగిందన్నారు. అలాగే సరిహద్దు భద్రత, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పూర్తిగా నిరోధించామని ట్రంప్ చెప్పారు. దేశంలోని ఆర్థిక అంశాల ను సైతం ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. గ్యాస్ ధరలు తగ్గించామని.. ఆ తర్వాత అంటే.. మూడు నెలల్లో యూఎస్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుందన్నారు. తమ కొత్త స్నేహితుడు, భాగస్వామి అయిన వెనిజులా నుంచి 80మిలియన్ బ్యారెళ్ల చమురును తీసుకున్నామని ఆయన వివరించారు. ఇదంతా ఆ దేశ నాయకుడు నికోలస్ మదురోను పదవీచ్యుతుడిని చేసిన నాటినుంచి నేటివరకు ఇది చోటు చేసుకుందన్నారు. దాంతో ఆమెరికా చమురు ఉత్పత్తి రోజుకు 60 వేల బ్యారెళ్ల మేర పెరిగిందని సోదాహరణగా విపులీకరించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో చేసిన ప్రతిజ్ఞ.. డ్రిల్, బేబీ, డ్రిల్‌ను ట్రంప్ ఉటంకించారు. వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్‌లో ఉభయసభలను ఉద్దేశించి ఆయన అతి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సుమారు గంటా 50 నిమిషాల పాటు ట్రంప్ మాట్లాడారు. తన ప్రసంగాల్లో ఇదే అతిసుదీర్ఘమైందిగా రికార్డుకెక్కింది. 2000 సంవత్సరంలో అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ అత్యధికంగా 90 నిమిషాల



పాటు మాట్లాడారు. ఇప్పుడు ఆ రికార్డును ట్రంప్ బ్రేక్ చేశారు. గత ఏడాది మార్చిలో కూడా ట్రంప్ సుమారు 100 నిమిషాల పాటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన విషయం తెలిసిందే. ట్రంప్ తన ప్రసంగంలో ఎక్కువగా ఆర్థిక ఎజెండా గురించి ప్రస్తావించారు. ఇక ఇరాన్ అంశంలో వార్నింగ్ ఇచ్చారు. వాస్తవానికి ఆ సమస్యను దౌత్యం ద్వారా పరిష్కరించేందుకు ఇష్టపడుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. కానీ అణ్వాయుధాలను సమీకరిస్తున్న ఇరాన్ వైఖరిని మాత్రం ట్రంప్ ఖండించారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ విరమించుకోవాలన్నారు. అమెరికాను తాకే క్షిపణులను ఇరాన్ డెవలప్ చేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. కానీ దీనిపై ఆయన తన ప్రసంగంలో ఎటువంటి ఆధారాలను బయటపెట్టలేదు. యురోప్‌కు ప్రమాదంగా మారే కొన్ని మిస్సైల్స్‌ను ఇప్పటికే ఇరాన్ డెవలప్ చేసిందన్నారు. ఇతర దేశాల్లో ఉన్న అమెరికా బేస్‌లను కూడా టా÷-గ్గ÷ట్ చేసే రేంజ్ ఇరాన్‌కు ఉందన్నారు. ఇక అమెరికా భూభాగానికి చేరుకునే స్థాయికి తగ్గ క్షిపణులను కూడా ఇరాన్ అభివృద్ధి చేస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. మిడిల్ ఈస్ట్‌పై ట్రంప్ ఎక్కువగా ఫోకస్ చేయడం వల్ల.. ఇరాన్‌తో యుద్ధానికి ఆ దేశం సిద్ధం అవుతుందేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే తాము ఇచ్చిన డిమాండ్లను ఒకవేళ ఇరాన్ అంగీకరించకపోతే, అప్పుడు ట్రంప్ అనుకున్నంత పనిచేసే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై దాడి చేశామని, ఆ దాడి వల్ల ఆ దేశ న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్ స్తంభించినట్లు ట్రంప్ చెప్పారు. న్యూక్లియర్ వెపన్ అంశంలో ఇరాన్ ఇంకా ఎటువంటి హామీ ఇవ్వలేదన్నారు. అణ్వాయుధాలను తయారు చేయమన్న వ్యాఖ్యలు ఇంకా ఇరాన్ నుంచి రావడం లేదన్నారు.

## 2019 ఈస్టర్ బాంబు పేలుళ్ల కేసు
## శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ అరెస్ట్





కొలంబో : 2019 ఈస్టర్ బాంబు పేలుళ్ల కేసులో శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్‌ను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున రాజధాని శివారులో రిటైర్డ్ మేజర్ జనరల్ సురేష్ సల్లేను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈస్టర్ ఆదివారం పేలుళ్లకు కుట్ర పన్నడం, సహాయం చేయడం మరియు ప్రోత్సహించిన ందుకు ఆయనను అరెస్ట్ చేశారని అన్నారు. గోటబయ రాజపక్స అధ్యక్షుడైన తర్వాత 2019లో స్టేట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ (ఎస్ఐఎస్) చీఫ్‌గా సురేష్ పదోన్నతి పొందారని, ఆత్మాహుతి బాంబుదాడులకు సహకారం అందించారని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. సురేష్ ఇస్లామిక్ బాంబర్లతో సంబంధం కలిగి ఉన్నాడని, దాడికి ముందు వారిని కలిశారని బ్రిటన్ మీడియా 2023లో వెల్లడించింది. ఆ ఏడాది జరిగిన అధ్యక్ష ఎన్నికలను రాజపక్సకు అనుకూలంగా ప్రభావితం చేసేందుకు ఈ దాడిని కొనసాగించేందుకు ఆయన అను మతించాడని ప్రజావేగు ఒకరు మీడియాకు తెలిపారు. 2019లో ఈస్టర్ పండుగ సమయంలో దేశవ్యాప్తంగా జరిగిన బాంబు పేలుళ్లలో 45మంది విదేశీయులు మర ణించగా, 500మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే.

## ఆస్పత్రి నుంచి శరద్ పవార్ డిశ్చార్జ్



ముంబయి : ఇటీవల అనారోగ్య కారణాల రీత్యా చికిత్స కోసం ఎన్‌సిపి నేత శరద్‌పవార్ పూనెలోని రూబీ హాల్ ఆసుపత్రిలో చేరారు. డీహైడ్రేషన్‌కు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు ఆదివారం ఈ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగుపడడంతో బుధవారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం శరద్‌పవార్ బాగానే ఉన్నారు. అందుకే ఆయనను డిశ్చార్జ్ చేశాం. రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించాం అని రూబీ హాల్ ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్, ఛైర్మన్ మేనేజింగ్ ట్రస్టీ అయిన డాక్టర్ పర్వేజ్ గ్రాంట్ అన్నారు. ఃూగా, శరద్‌పవార్ ఈ నెల్లోనే ఫిబ్రవరి 9న ఛాతి ఇన్ఫెక్షన్ వల్ల ఇదే ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. ఆరోగ్యం మెరుగుపడగానే ఆయన ఫిబ్రవరి 14న డిశ్చార్జ్ అయ్యారు.

## నేడు భారత్‌లో పర్యటించనున్న కెనడా ప్రధాని



టొరంటో: కెనడా ప్రధాని మార్క్ కార్నీ భారత్‌లో పర్యటించనున్నారు. ఆయన గురువారం ముంబయికి చేరుకుని ప్రధాని నరేంద్ర మోదీ, వ్యాపారవేత్తలతో భేటీ కానున్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక, దౌత్య సంబంధాల పునరుద్ధరణకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఎదురు చూస్తోందని కెనడా ప్రధానమంత్రి కార్యాలయం మంగళవారం పేర్కొంది. అమెరికా ప్రాధాన్యంగా ఉన్న వాణిజ్య సంబంధాలను వైవిధ్య పరిచే ప్రణాళికలో భాగంగా భారత్, ఆస్ట్రేలియా, జపాన్‌లలో కార్నీ పర్యటించనున్నట్లు తెలిపింది.

తహవ్వుర్ రాణా పౌరసత్వ రద్దుకు చర్యలు!

కార్నీ భారత పర్యటనకు బయలుదేరటానికి ముందే... ముంబయి ఉగ్రదాడి (2008)లో కీలక పాత్ర పోషించిన నిందితుడు, పాకిస్థాన్‌లో జన్మించిన కెనడా వాసి తహవ్వుర్ రాణా(64) పౌరసత్వాన్ని రద్దు చేసే దిశగా కెనడా ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే ఉగ్రవాద చర్యలకు కాకుండా... దరఖాస్తుల్లో తప్పుడు సమాచారానికి గాను రాణా పౌరసత్వాన్ని రద్దు చేయాలని కెనడా నిర్ణయం తీసుకుందని ఓ నివేదిక తెలిపింది. 2001లో కెనడా పౌరసత్వాన్ని పొందిన రాణా.. అంతకుముందు తన నివాసం వివరాలను వక్రీకరించారని పోలీసుల విచారణలో తేలింది. ఇది అత్యంత తీవ్రమైన నేరమని ఇమిగ్రేషన్ అధికారులు నిర్ధరించి పౌరసత్వ రద్దుకు ఉపక్రమించారు. రాణా ప్రస్తుతం భారత్ కస్టడీలో ఉన్నాడు.

## ఢిల్లీలో గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం
## బిష్ణోయ్ లీగల్ టీమ్‌పై కాల్పులు

న్యూఢిల్లీ : దేశ రాజధానిలో మరోసారి గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం రేపాయి. తీహార్ జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ లీగల్ టీమ్‌ను లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటన ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలో చోటుచేసుకుంది. లారెన్స్ బిష్ణోయ్ తరపున కోర్టు కేసులను వాదించే న్యాయవాదుల బృందం వాహనంలో ప్రయాణిస్తున్న సమయంలో ఈ దాడి జరిగింది. బైక్‌పై వచ్చిన దుండగులు ఒక్కసారిగా లీగల్ టీమ్ వాహనంపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీటీవీ (అఅ÷ఎ) ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది గ్యాంగ్ వార్‌లో భాగమా లేక లాయర్లను భయా ఎట్టడానికి చేసిన ప్రయత్నమా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. కాగా, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఇప్పటికే అనేక హై-ప్రొఫైల్ హత్యలు, బెదిరింపుల కేసుల్లో నిందితులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అతని లీగల్ టీమ్‌పై దాడి జరగడం సంచలనంగా మారింది.

## మోడీకి ఇజ్రాయిల్ గుజరాత్ లాంటిదే
### సిపిఐ ఎంపి సంతోష్ కుమార్ విమర్శలు

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీకి ఇజ్రాయిల్ రెండో గుజరాత్ లాంటిదని సిపిఐ ఎంపి సంతోష్ కుమార్ విమర్శించారు. ప్రధాని మోడీ రెండురోజులపాటు ఇజ్రాయిల్ పర్యటన కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో గాజాలో మారణహోమం సృష్టించి వేలాది మంది పాలస్తీనియన్ల ప్రాణాలను బలితీస్తున్న ఇజ్రాయిల్‌ను మోడీ సందర్శించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెతుతున్నాయి. తాజాగా మోడీ ఇజ్రాయిల్ పర్యటనపై సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇజ్రాయిల్‌ను సందర్శించడం ప్రధాని మోడీకి ఒక హాబీగా మారింది. ఇజ్రాయిల్ ఆయనకు రెండవ గుజరాత్. ఇజ్రాయిల్ మానవాళి ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే దేశం.

## ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలలో ఎస్పీ మహేష్ బి గితే పరిశీలన

**పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు**
**- 163 బీఎన్ఎస్ఎస్ (సెక్షన్ 144) అమలు.**



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 25: నేటి మన దేశమ్ ప్రతినిధి** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల సందర్భంగా సిరిసిల్ల పట్టణ కేంద్రంలోని జూనియర్ కలశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడుతున్న తీరును సమీక్షించి, కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 16 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా,అవాంఛనీయ ఘటనలు లేకుండా జరగడానికి 163 బీ ఎన్ ఎస్ ఎస్ (సెక్షన్ 144) అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని,ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడ కుండా చూడలన్నారు. పరీక్షా కేంద్రం నుండి 200 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్లు ఉదయం 08 గంటల నుండి మధ్యాహ్నం 01 గంటల వరకు మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి నిబంధనలు కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ వెంట పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ సిబ్బంది ఉన్నారు.

## బిజెపి మైనార్టీ మోర్చా నేతల ఆధ్వర్యంలో మేయర్ కోలగని శ్రీనివాస్ కు ఘన సన్మానం



**కరీంనగర్, ఫిబ్రవరి 25: నేటి మన దేశ మ్ ప్రతినిధి** బిజెపి మైనార్టీ మోర్చా కరీంనగర్ నేతలు బుధవారం రోజున కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు. ప్ర ప్రథమంగా తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్ బల్దియా ను బిజెపి కైవసం చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని , మేయర్ గా , కోలగని శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ , జిల్లా అధ్యక్షుడు సమీ పర్వేజ్ ఆధ్వర్యంలో బుధవారం రోజున కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ కోలగని శ్రీనివాస్ ను వారంతా మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మైనార్టీ మోర్చా నేతలు పవిత్ర రమజాన్ మాసాన్ని పురస్కరించుకుని కరీంనగర్ నగరంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని మేయర్ ను కోరారు. ముఖ్యంగా మస్జిద్ పరిసర ప్రాంతాలు మరియు మైనారిటీ వార్డుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ , మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండి సమీ పరవేజ్ రాష్ట్ర నాయకులు ఎండి తాజ్,ఎండి బషీరుద్దీన్, జిల్లా నాయకులు ఎండి సమీ సిద్దిక్ షాదాబ్ , ఎండి అపాన్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్పోర్ట్స్-మీట్‌లో జిల్లా పోలీసుల ఉత్తమ ప్రదర్శన

**- 08 పతకాలతో సత్తా చాటిన జిల్లా పోలీస్ క్రీడాకారులు**
**- క్రీడాకారులకు జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అభినందన**



**రాజన్న సిరిసిల్ల ఫిబ్రవరి 25: నేటి మన దేశమ్ ప్రతినిధి** సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా ఫిబ్రవరి 16 నుండి 21 తేదీ వరకు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 4వ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా పోలీసు క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 08 పతకాలు (04-బంగారు, 04-కాంస్య) సాధించడం పట్ల జిల్లా ఎస్పీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విజేతలకు పతకాలు అందజేసి అధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గెలుపోటములు సహజమని,విజేతలు జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన ఇవ్వడానికి కృషి చేయాలన్నారు. ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా తమలోపాలను సరిదిద్దుకొని ముందుకు సాగాలని సూచించారు. లాన్ టెన్నిస్ విభాగంలో జిల్లా ఆర్మడ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ మధుకర్ కాంస్య పతకాన్ని సాధించారు. బ్యాట్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్ లో డిసిర్బి ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు కాంస్య పతకాన్ని సాధించారు..టేబుల్ టెన్నిస్ లో ఏ. ఆర్.ఎస్.ఐ లు సత్యనారాయణ, ఆనంద్ లు కాంస్య పతకాలను సాధించారు. కాయకింగ్ లో ఆర్మడ్ రిజర్వ్ కానిస్టేబుల్ సతీష్ 500 మీటర్స్ సింగిల్, 500 మీటర్స్ డబుల్స్ , 200 మీటర్స్ సింగిల్ లో బంగారు పతకాన్ని సాధించారు. కాయకింగ్ లో ఆర్మడ్ రిజర్వ్ కానిస్టేబుల్ గంగరాజు 500 మీటర్స్ సింగిల్, 500 మీటర్స్ డబుల్స్ లో బంగారు పతకాన్ని సాధించారు.

## రాజంపేట మండలం కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను సందర్శించినారు

### జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి,ఫిబ్రవరి 25.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**రాజంపేట మండలంలోని కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. భోజన నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను తనిఖీ చేసి, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి భోజనం పై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా మమేకమై తరగతి గదిలో 10 వ తరగతి విద్యార్థులతో కలిసి లెక్కల ప్రక్రియ (గణిత సమస్యలు) చేయించి వారి అవగాహన స్థాయిని తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, గణితం పై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. సమస్యలను సులభంగా పరిష్కరించే పద్ధతులను వివరించి, నిరంతర అభ్యాసం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రోత్సహించారు.విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుకు సాగాలని, ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు బోధనలో నూతన పద్ధతులను అవలంబించాలని కలెక్టర్ సూచించారు.అలాగే, సి.ఎస్.ఆర్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులు పఠనం పై ఆసక్తి పెంపొందించుకోవాలని, గ్రంథాలయాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్స్ లో కోడింగ్ , రోబోటిక్స్ విభాగాల్లో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి వారిని అభినందించారు. సాంకేతిక విద్యలో ముందంజలో ఉండాలని ప్రోత్సహించారు.పాఠశాల వసతులు, బోధన విధానం, తరగతి గదుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించి, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రాజు , మండల విద్యాధికారి పూర్ణచంద్రరావు , మండల ఎండీఓ బాలకృష్ణ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర , ఉపాధ్యాయ బృందం , ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పక్షవాతం బాధితుడి కుటుంబానికి బిఆర్ఎస్ నాయకులు షైక్ ఫరీద్ అండ

### రేణుక నగర్‌లో 50 కిలోల బియ్యం అందజేత......



**నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్):** ఆపదలో ఉన్న కుటుంబానికి తోడుగా నిలవడం మానవత్వానికి నిదర్శనం. రేణుక నగర్‌లో నివాసముండే సత్యనారాయణ పక్షవాతం, గుండెపోటుతో అనారోగ్యానికి గురై ఉపాధి కోల్పోయాడు. చికిత్స ఖర్చులు, రోజువారీ అవసరాలు కుటుంబాన్ని ఆర్థికంగా కుదేలు చేస్తున్న వేళ, సమాచారం అందుకున్న బిఆర్ఎస్ నాయకులు తక్షణం స్పందించారు.స్థానిక బిఆర్ఎస్ నేతలు షైక్ ఫరీద్, వినీత్ కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. "ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం సామాజిక బాధ్యత" అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలకృష్ణ గుప్త, ఉమేష్ పాల్గొని కుటుంబానికి ధైర్యం చెప్పారు. స్థానికులు ఈ సహాయాన్ని అభినందిస్తూ, ఇలాంటి మానవీయ కార్యక్రమాలు మరింత మందికి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.

## మందమర్రిలో మెగా ఉచిత కంటి శిబిరం




**మందమర్రి ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్):** 45 మందికి పరీక్షలు, 20 మందికి ఉచిత శస్త్రచికిత్సలు మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ (ఆర్.ఎం.పీ) సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. మార్కెట్ ఏరియాలోని పాల చెట్టు సమీపంలోని ఆర్.ఎం.పీ సంఘం కార్యాలయంలో ఈ శిబిరం జరిగింది.బి.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ కంటి వైద్యుడు డాక్టర్ బి.వి. రఘునందన్ పాల్గొని రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో మొత్తం 45 మందికి కంటి పరీక్షలు చేయగా, అందులో 20 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు.అవసరమైన వారికి నందన్ హాస్పిటల్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.స్థానిక ప్రజలు ఈ శిబిరాన్ని స్వాగతిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని కోరారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడ్డారు.

## పరీక్షల వేళ విద్యార్థులకు తోడ్పాటు అందించండి: తుపాకుల జనార్ధన్ పిలుపు



**నేరేడ్‌మెట్ , ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్):** పరీక్షల సీజన్ నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని 140వ డివిజన్ బిఆర్ఎస్ నాయకుడు తుపాకుల జనార్ధన్ విజ్ఞప్తి చేశారు.పరీక్షా కేంద్రాలకు వెళ్లే మార్గంలో విద్యార్థులు ఎవరైనా లిఫ్ట్ లేదా డ్రాప్ కోరితే స్థానికులు, వాహనదారులు సాధ్యమైనంత వరకు సహాయం చేయాలని ఆయన కోరారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు అనుమతి నిరాకరించే పరిస్థితులు ఉన్నందున సమయపాలన అత్యంత కీలకమని పేర్కొన్నారు.పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల ప్రయాణ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులపై మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, వారికి ధైర్యం చెప్పడం, సమయానికి కేంద్రాలకు చేరుకునేలా చేయడం ప్రతి పౌరుడి కర్తవ్యమని అన్నారు."మన చిన్న సహాయం ఒక విద్యార్థి భవిష్యత్తును మార్చగలదు. పరీక్షల కాలంలో సేవాభావంతో ముందుకు వచ్చి విద్యార్థులకు తోడ్పాటు అందిద్దాం" అని తుపాకుల జనార్ధన్ పిలుపునిచ్చారు.మల్కాజిగిరి డివిజన్ ప్రజలు విద్యార్థుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించి ఆదర్శంగా నిలవాలని కోరారు .

## ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**మేడ్చల్--మల్కాజ్‌గిరి,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్):** జిల్లాలో బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రత్యక్షంగా పరిశీలించారు.శామీర్‌పేట్ మండలంలోని తూంకుంటలో ఉన్న సాయితేజ జూనియర్ అండ్ డిగ్రీ కాలేజీతో పాటు ఉప్పర్‌పల్లిలోని ఎక్సెలెన్సియా జూనియర్ కాలేజీల్లో జరుగుతున్న పరీక్షా ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. పరీక్షలు పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి సజావుగా నిర్వహణ జరిగేలా చూడాలని సూచించారు.పరీక్షలు జరుగుతున్న తరగతి గదులను సందర్శించి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తున్నారా అనే అంశాన్ని పరిశీలించారు. తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, వైద్య సదుపాయాలు వంటి మౌలిక సౌకర్యాలపై జిల్లా ఇంటర్మీడియెట్ అధికారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో హాజరైన, గైర్హాజరైన విద్యార్థుల వివరాలను సేకరించారు.సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా అనే విషయాన్ని తనిఖీ చేసి, డిస్‌ప్లే గదిలో నుంచి ప్రతి పరీక్ష గదిని పరిశీలించారు. ప్రశ్నపత్రాల ఓపెనింగ్ సమయం, నిర్ణీత సమయానికంటే ఐదు నిమిషాల ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు అనుమతి ఇచ్చారా అనే అంశాలపై యాజమాన్యాన్ని ప్రశ్నించారు.ఈ పర్యటనలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కిషన్, శామీర్‌పేట్ తహసీల్దారు సుచరిత తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ

### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డి, జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 25:-(నేటి మనదేశమ్)**ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించే క్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బుధవారం పరీక్షల తొలి రోజున జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, షాహిన్ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పరీక్షా హాళ్లలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరును, పరీక్షల నిర్వహణ విధానాన్ని నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలను ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోనే ప్రశ్నాపత్రాలను తెరిచారా లేదా అన్నది పరిశీలించారు. సీసీటీవీ నిఘా మధ్య ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించారు.పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, మెడికల్ కిట్‌తో ఏఎన్ఎం అందుబాటులో ఉండటం, టాయిలెట్ వసతులు వంటి మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పరీక్షలు పూర్తైన వెంటనే ఆన్సర్ షీట్లను తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు సురక్షితంగా తరలించాలని సూచించారు. ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకతతో, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ తనిఖీలో సంబంధిత పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మరియు అధికారులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకోవాలి ...

### -జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ , ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్ ప్రతినిధి ):** జిల్లా వ్యాప్తంగా బుధవారం ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల తొలిరోజు జిల్లాలో 95.70 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. నిర్మల్ పట్టణంలోని శాంతినగర్‌లో గల ప్రభుత్వ జూనియర్ బాలబాలికల కళాశాలలోని పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పరీక్ష గదులను సందర్శించి, విద్యార్థులకు కల్పించిన వసతులను పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని సూచిస్తూ, పరీక్ష కేంద్రాల్లోని సీసీ కెమెరాల పనితీరును స్వయంగా పరిశీలించారు. జిల్లాలో మొదటిరోజు పరీక్షకు మొత్తం 7,076 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, వారిలో 6,772 మంది (95.70%) హాజరయ్యారు. వివిధ కారణాల వల్ల 304 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు ధృవీకరించారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరశురాం, తహసీల్దార్ రాజు, అధికారులు, తదితరులు ఉన్నారు.



## ఇంటర్ వార్షిక పరీక్షలపై డీఎస్పీ నల్లపు లింగయ్య ఆకస్మిక తనిఖీ



**నారాయణపేట ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్):** బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద గల సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను డీఎస్పీ నల్లపు లింగయ్య తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి పోలీసు అధికారులు సిబ్బందికి భద్రత పరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును, భద్రతా ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసెందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును పటిష్టంగా ఏర్పాటు చేశామని మరియు 163 BNSS (144) సెక్షన్ అమల్లో ఉన్నందున అనవసర గుంపులు ఏర్పడకుండా చూడాలని, సెల్‌ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించవద్దని ఆదేశించారు. విద్యార్థులకు తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా కఠినంగా వ్యవహరించాలని అధికారులను డీఎస్పీ ఆదేశించారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని ఆయన తెలిపారు.ప్రశ్నపత్రాల రవాణా సమయంలోనూ, పరీక్షలు ముగిసిన అనంతరం జవాబు పత్రాలను పూర్తిస్థాయి పోలీస్ బందోబస్తుతో సురక్షితంగా పోస్ట్ ఆఫీస్ కు తరలించాలని ఆయన సూచించారు. డిఎస్పి తో పాటు ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్




**కామారెడ్డి,ఫిబ్రవరి 25.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**జిల్లాలో నేటి నుండి ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రశ్నాపత్రాల భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ, విద్యార్థుల హాజరు శాతం,హాల్ టికెట్ల తనిఖీ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని, మాల్ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రాలకు తీసుకురాకుండా చూడాలని, సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు.కలెక్టర్ వెంట ఇంటర్మీడియట్ అధికారి , తహసిల్దార్ హిమబిందు, ప్రిన్సిపల్, తదితరులు ఉన్నారు.

## సానిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



**కామారెడ్డి,ఫిబ్రవరి 25.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**మున్సిపల్ శాఖలోని సానిటేషన్ జోన్ -2 పరిధిలోని సిబ్బందితో మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ సానిటేషన్ పనుల విషయం లో ఎలాంటి తప్పిదాలు జరగకుండా సక్రమంగా పనులు నిర్వర్తించాలని మునిసిపల్ అభివృద్ధిలో మీరు కూడా భాగస్వాములు కావాలి అని సిబ్బందిని కోరడం జరిగింది.ఈ కార్యక్రమం లో వైస్ చైర్ పర్సన్ కాసార్ల గోదావరి స్వామితో పాటు కౌన్సిలర్స్ గడ్డం మహేష్,నాగమణి విజయ భాస్కర్,కళ్లెం సావిత్రి సత్యం,లక్ష్మి నారాయణ,మామిండ్ల లక్ష్మణ్,అన్వార్,నిట్టు గంగాధర్,సిద్దిక్,బబులు మున్సిపల్ సిబ్బంది ఎస్సై నగేష్,వార్డ్ జవాన్లు, తదితరులు పాల్గొనడం జరిగినది.

## తప్పిపోయిన బాలుడిని తల్లికి చేర్చిన ముదిగొండ పోలీసులు.




**మధిర ప్రతినిధి/ ముదిగొండ, ఫిబ్రవరి 25, నేటి మన దేశమ్.** గంధసిరి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ముదిగొండ పోలీస్ స్టేషన్ సిబ్బంది దారి తప్పి తిరుగుతున్న 10 సంవత్సరాల బాలుడిని గమనించారు. వివరాలు తెలుసుకోగా అతని పేరు కట్ట పెనుకొండయ్యగా, తల్లిదండ్రులు జగ్గయ్యపేటకు చెందినవారని గుర్తించారు. వెంటనే స్పందించిన ఎస్ఐ హరిత బాలుడి తల్లి కట్ట విజయకుమారిని పిలిపించి ఆమెకు సురక్షితంగా అప్పగించారు. పోలీసుల అప్రమత్తతపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు.


## ప్రకృతి వ్యవసాయంతో తెలంగాణ రాష్ట్ర రైతురత్న అవార్డు పొందిన అశ్వాపురం రైతు భద్రయ్యకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఘన సన్మానం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఫిబ్రవరి 25: పినపాక నియోజకవర్గం ( నేటి మన దేశమ్ ప్రతినిధి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలానికి చెందిన రైతు చిగురుపాటి భద్రయ్య వరి పంటను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసి రాష్ట్ర స్థాయి ప్రతిష్టాత్మకమైన తెలంగాణ రాష్ట్ర రైతురత్న అవార్డు అందుకోవడం పట్ల ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భద్రయ్య ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రకృతి వ్యవసాయం రైతుల ఖర్చులను తగ్గిస్తూ, ఆరోగ్యకరమైన పంటల ఉత్పత్తికి దోహదపడుతుందని లిఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రకృతి సేద్యం పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా మార్గదర్శకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ??ఈ కార్యక్రమంలో సమితి సింగారం ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ , కరకగూడెం మండల అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్ , స్థానిక నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు మరియు మండల ప్రముఖులు పాల్గొన్నారు.

## మణుగూరు శ్రీ కాళీమాత ఆలయ పునఃప్రతిష్ఠకు కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి సానుకూల స్పందన

**ఆలయానికి ప్రత్యామ్నాయ స్థలం, పరిహారం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశం**
**భక్తుల మనోభావాలను గౌరవిస్తూ నిర్ణయం తీసుకోవాలని లేఖ**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఫిబ్రవరి 25 :పినపాక నియోజకవర్గం (నేటి మన దేశమ్ ప్రతినిధి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలంలోని చారిత్రాత్మక శ్రీ కాళీమాత ఆలయ తరలింపు మరియు పునఃప్రతిష్ఠా పనులపై కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. బి.టి.పి.ఎస్. రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా 55 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం తొలగింపుకు గురవుతున్న నేపథ్యంలో, ఆలయ కమిటీ విన్నపాన్ని పరిశీలించిన మంత్రి తక్షణమే చర్యలు చేపట్టారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్‌కు అధికారికంగా లేఖ పంపడం జరిగింది. రైల్వే లైన్ నిర్మాణం కారణంగా ఆలయాన్ని ప్రస్తుత ప్రాంతం నుండి తరలించాల్సి ఉన్నందున, శాస్త్రోక్తంగా పునఃప్రతిష్ఠించడానికి తగిన ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలని మంత్రి కోరారుఆలయ నిర్మాణానికి మరియు తరలింపుకు అవసరమైన నష్టపరిహారాన్ని కూడా నిబంధనల ప్రకారం అందించాలని సూచించారుగత 55 ఏళ్లుగా ఈ ప్రాంత భక్తుల ఆరాధ్య దైవంగా ఉన్న కాళీమాత ఆలయానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను మరియు భక్తుల సెంటిమెంట్లను దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రి కలెక్టర్‌కు పంపిన లేఖలో పేర్కొన్నారు. ఆలయ ట్రస్టీ శ్రీ ఉప్పల సత్యనారాయణ శాస్త్రి కుమారుడు శ్రీ ఉప్పల శ్రీఖర్‌లి మరియు .గడ్డం రాము అందించిన విన్నపం మేరకు మంత్రి స్పందిస్తూ, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయం పట్ల ఆలయ కమిటీ సభ్యులు మరియు మణుగూరు భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

## కామారెడ్డి నూతన కౌన్సిలర్లకు రామేశ్వర్ పల్లి మాజీ విడిసి అధ్యక్షుడు టీ.నర్సారెడ్డి ఘన సన్మానం



**కామారెడ్డి,ఫిబ్రవరి 25.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** కామారెడ్డి లో నూతనంగా ఎన్నుకోబడ్డ మున్సిపల్ కౌన్సిలర్ లకు ముగ్గురు రెడ్డిలకు అనగా శ్రీధర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, నరేందర్ రెడ్డి కి రామేశ్వర్ పల్లి రెడ్డిలు మాజీ విడిసి అధ్యక్షులు తక్కల నరసారెడ్డి వారికి ఘనంగా సన్మానించి సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగర్తి చంద్రారెడ్డి, రెడ్డి గారి రమేష్ రెడ్డి, వల్ల కొండ గంగారెడ్డి, సందుగారి రవీందర్ రెడ్డి ,కందడి బాల్రెడ్డి, పెద్దోళ్ల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి

**-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 25: నేటి మన దేశమ్ ప్రతినిధి** రాజన్న సిరిసిల్లజిల్లాలో నిర్వహించే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సంబంధిత జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు వచ్చే నెల (మార్చి) 14 వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు నిర్వహించ నున్నారని తెలిపారు. 7,317 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు 34 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద పరీక్ష జవాబు పత్రాలను ప్రశ్నపత్రాలను తరలించే సమయంలో పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్ష జరుగుతున్నంత సేపు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్ష సమయం అనుకూలంగా తగినంత బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్షలు కొనసాగే సమయంలో సమీప జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. ఆయా పరిధిలో ఉన్న మున్సిపల్ కమిషనర్లు, ఎంపీ డీఓలు పరీక్ష కేంద్రాలను ముందస్తుగా పరిశీలించి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే ప్రతి పరీక్ష కేంద్రంలో వసతులను ఏర్పాటు చేయాలని, ఏఎన్ఎం ను అందుబాటులో ఉంచి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా ప్రదేశాల్లో వెళ్లే ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించాలని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ చంద్రయ్య, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, డీటీఓ నవీన్ కుమార్, ఆర్టీసీ, పోస్టల్, వైద్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ

**బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు**
**పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**జగిత్యాల,ఫిబ్రవరి 25(నేటి మన దేశమ్ ప్రతినిధి):** :పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ జరుగుతుందని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అన్నారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా బుధవారం జగిత్యాల ఎస్.కె.ఎన్.ఆర్ (బాలుర) జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత,హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూవిద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. పరీక్ష గదుల్లో వెలుతురు,తాగునీరు, శౌచాలయాల నిర్వహణ సక్రమంగా ఉన్నాయా అనే విషయాలను పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్ర పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు విషయాన్ని అధికారులు పాటించాలని సూచించారు. మొబైల్ ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని కోరారు. పరీక్షా సిబ్బంది తమ విధులను నిబద్ధతతో, భాద్యతగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో ఒకే విధమైన ప్రమాణాలు పాటించాలని తెలిపారు. వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో డిఐఈవో నారాయణ, తహసీల్దార్ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 27న దిశ సమావేశం నిర్వహణ

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**




**ఖమ్మం,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్):** ఫిబ్రవరి 27న శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 27న జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో దిశ కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన నిర్వహించు దిశ సమావేశానికి గౌరవ సభ్యులు అందరూ హాజరు కావాలని, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## జవహర్ నవోదయ విద్యాలయం కొరకు స్థల పరిశీలన



**కోరుట్ల,ఫిబ్రవరి 25(నేటి మన దేశమ్ ప్రతినిధి):** :కోరుట్ల లో ప్రతిపాదించిన జవహర్ నవోదయ విద్యాలయ కొరకు స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్.లతపరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాలయం నిర్మాణానికి అనుకూలంగా గుర్తించిన స్థలాన్ని సవివరంగా పరిశీలించారు. భూమి విస్తీర్ణం,సరిహద్దులు,రహదారులు, మౌలిక సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించే విధంగా స్థలం ఎంపిక కావాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించి ఎలాంటి వివాదాలు లేకుండా చూడాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. తాగునీరు, విద్యుత్, రహదారి సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుతో ప్రాంతీయ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని ప్రక్రియలు పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య,డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి


**-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి -25: నేటి మన దేశమ్ ప్రతినిధి** రాజన్న సిరిసిల్లజిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సము దాయంలో బుధవారం నిర్వహించారు. జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం వంటి పలు అంశాలపై చర్చించారు. అనంతరం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి ఆరోగ్య చికిత్స, కౌన్సిలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. డ్రగ్స్, గంజాయితో కలిగే ఇబ్బందులపై యువత, విద్యార్థులకు ఎక్సైజ్, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా అవగాహన కల్పించాలని సూచించారు. అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష, తదితరులు పాల్గొన్నారు.


## డిఫాల్ట్ రైస్ మిల్లులపై క్రిమినల్ కేసుల నమోదు

**అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**



**ఖమ్మం,ఫిబ్రవరి 25 (నేటి మనదేశమ్):** ప్రభుత్వానికి సంబంధించిన ధాన్యం కస్టమ్ మిల్లింగ్ (సిఎంఆర్)లో ఒప్పంద నిబంధనలు ఉల్లంఘించి, ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకుండా డిఫాల్ట్ చేసిన రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం మంగలగూడెం గ్రామంలోని శ్రీ సత్యనారాయణ సిల్కీ సార్టెక్స్ రైస్ మిల్ యాజమాన్యం 2021--22 ఖరీఫ్, 2022--23 ఖరీఫ్, రబీ, 2023--24 ఖరీఫ్ సీజన్లలో ప్రభుత్వానికి బియ్యం అందజేయడంలో విఫలమై 9.49 కోట్ల రూపాయలు అసలు బకాయి కలిగి ఉండగా, పెనాల్టీలతో కలిపి 13.84 కోట్ల వరకు డిఫాల్ట్ చేసినట్లు తెలిపారు. ఈ మిల్లు మేనేజింగ్ భాగస్వామి కన్నేటి జ్యోతి, భాగస్వామి మామిడాల మానసపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్. నెం. 129/2026 నమోదు చేయబడిందని అన్నారు. అలాగే నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామంలోని వెంకటేశ్వర రైస్ మిల్ 2022--23 ఖరీఫ్, రబీ సీజన్లలో 7.59 కోట్ల అసలు బకాయి కలిగి ఉండగా, పెనాల్టీలతో కలిపి 10.88 కోట్ల వరకు డిఫాల్ట్ చేసినట్లు తెలిపారు. ఈ మిల్లు యజమాని మేకల రామారావుపై నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్. నెం. 47/2026 నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ధాన్యం, నిధుల పరిరక్షణలో రాజీ పడబోమని, డిఫాల్ట్ చేసే మిల్లర్ల పై చట్టపరమైన కఠిన చర్యలు కొనసాగుతాయని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. బకాయిల వసూలు చర్యలు వేగవంతం చేయడంతో పాటు సంబంధిత శాఖల ద్వారా తదుపరి విచారణ కొనసాగుతున్నదని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రారంభం



**నారాయణపేట ఫ్రిబావరి 25 ( నేటి మన దేశమ్ ప్రతినిధి)** నారాయణపేట మండలం అవంగాపూర్ గ్రామం అభివృద్ధి పనుల్లో భాగంగా బుధవారం 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా వచ్చిన డబ్బులతో నాలుగో వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను సర్పంచ్ బి రవికుమార్ ఉపసర్పంచ్ గుండేపల్లి రాధాకృష్ణ ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికై మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సి రవికుమార్ బి ఆశప్ప బీభసప్ప ఎం కనకప్ప హుస్సేన్ బాలప్ప గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from # 5-5-426, M.J. Road, Hyderabad and
Printed at SKYLINE PRESS, # D.No. 5-5-426, M.J. Road, Hyderabad - 500 001 . Ph: 24734846, 9701891645, E-mail: netimanadesam96@gmail.com